“ మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

“ మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

మంగళవారం TUESDAY 2-6-2026 | జగిత్యాల JAGITIAL | సంపుటి: 1 Volume:1 | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంచిక: 334 Issue: 334

02 జూన్ 2026 - మంగళవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ(అధిక) మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - తె. 5:44 సూర్యాస్తమయం - సా. 6:43 తిథి విదియ రా. 7:01 వరకు తదుపరి తదియ సంస్కృత వారం భౌమ వాసరః నక్షత్రం మూల రా. 9:58 వరకు తదుపరి పూర్వాషాఢ యోగం సాధ్య ఉ. 7:07 వరకు కరణం తైతుల తె. 5:49 వరకు గరజ రా. 7:01 వరకు వర్జ్యం తె. 4:07 నుండి తె. 5:55 వరకు దుర్ముహూర్తం ఉ. 8:20 నుండి ఉ. 9:12 వరకు రా. 11:07 నుండి రా. 11:52 వరకు రాహుకాలం మ. 3:28 నుండి సా. 5:06 వరకు యమగండం ఉ. 8:59 నుండి ఉ. 10:36 వరకు గుళికాకాలం మ. 12:14 నుండి మ. 1:51 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:08 నుండి తె. 4:56 వరకు అమృత ఘడియలు మ. 2:59 నుండి సా. 4:47 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:48 నుండి మ. 12:40 వరకు గమనిక: “o” అనగా మరుసటి రోజున

Circulated to Telangana
Published from Jagitial





## జోరుగా జీఎస్టీ వసూళ్లు

దేశంలో వస్తుసేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు నిలకడగా కొనసాగుతున్నాయి. ఈ ఏడాది మే నెలలో స్థూల జీఎస్టీ వసూళ్లు రూ.1.94 లక్షల కోట్లుగా నమోదైనట్లు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ సోమవారం ప్రకటించింది. గత సంవత్సరం ఇదే నెలలో వసూలైన రూ.1.88 లక్షల కోట్ల జీఎస్టీ వసూళ్లతో పోలిస్తే ఇది 3.2 శాతం అధికమని తెలిపింది.


న్యూఢిల్లీ: రిఫండ్‌లను సర్దుబాటు చేసిన తర్వాత నికర జీఎస్టీ ఆదాయం రూ.1.67 లక్షల కోట్లుగా ఉంది. ఇది గత ఏడాది ఇదే నెలతో పోలిస్తే 3.3 శాతం ఎక్కువ. ఏప్రిల్‌లో నమోదైన రికార్డు స్థాయి రూ.2.43 లక్షల కోట్ల వసూళ్లతో పోలిస్తే మే నెలలో ఆదాయం తగ్గింది. అయితే ప్రతి సంవత్సరం ఆర్థిక సంవత్సరం - 2 వ పేజీలో...




## రంజుగా యూపీఐ లావాదేవీలు

యూపీఐ లావాదేవీలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. మే నెలలో రూ.29.90 లక్షల కోట్ల 23.2 బిలయన్ డాలర్ల విలువైన యూపీఐ లావాదేవీలు జరిగినట్టు ఎన్‌పీసీఐ విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. ఏప్రిల్ నెలలో రూ.29.03 లక్షల కోట్ల లావాదేవీలు జరుగగా, అంతక్రితం ఏడాది ఇదే నెలలో రూ.25.14 లక్షల కోట్ల స్థాయిలో ఉన్నాయి.

న్యూఢిల్లీ: విలువ పరంగా చూస్తే క్రితం ఏడాది ఇదే నెలలో 18.67 బిలియన్ల లావాదేవీలు జరుగగా, ఈసారి 24% వృద్ధితో 23.2 బిలియన్లకు చేరుకున్నాయని క్యాష్‌ఫ్రీ పేమెంట్స్ కో-ఫౌండర్, సీఈవో ఆకాశ్ సిన్హా తెలిపారు. వేసవి ప్రయాణాలు, ఐపీఎల్ 2026, కాలానుగుణంగా వినియోగదారులు యూపీఐ ద్వారా తమ చెల్లింపులు జరుపడం వల్లనే రికార్డు స్థాయికి చేరుకున్నాయన్నారు.



తెలంగాణ ప్రజలకు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు
- ఎడిటర్, ఈవార్తలు దినపత్రిక

# తల తాకట్టు పెడతా!



### ఇందిరమ్మ ఇండ్లకు నిధులు నా బాధ్యత

### నెలలోనే ఇంటి నిర్మాణం.. కొత్త టెక్నాలజీని తెస్తున్నాం

### కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో రేవంత్ వెల్లడి

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం తొలి విడతలో భాగంగా నిర్మాణాలు పూర్తి చేసుకున్న ఇళ్ల గృహ ప్రవేశం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో పర్యటించారు. కోరారి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశంలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి.. ఈ సందర్భంగానే రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవానికి పైలాన్‌ను ఆవిష్కరించారు.

ఆసిఫాబాద్, జూన్ 1 (ఈవార్తలు): రెండో విడతలో రాష్ట్రంలో మరో రెండున్నర లక్షల మంది కి ఇళ్లను మంజూరు చేస్తున్నట్లు ప్రకటన చేశారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి.. రాష్ట్రంలో అర్హులైన ప్రతీ ఒక్కరు ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకోవాలని సూచించారు. ఈ క్రమంలోనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం శరవేగంగా సాగాలని సూచించారు.అటు లబ్ధిదారులకు, ఇటు అధికారులకు కూడా ఈ సందర్భంగా కీలక సూచనలు చేశారు. ఇళ్ల నిర్మాణం శరవేగంగా పూర్తి చేసుకునేందుకు కొత్త టెక్నాలజీని తీసుకు వస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఆ టెక్నాలజీతో కేవలం నెల రోజుల్లోనే ఇల్లు నిర్మాణం పూర్తి అవుతుందని వెల్లడించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం కోసం తాను నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. తండాలు, గూడెంలలో నివసించే అర్హులైన ఆదివాసీల కోసం ప్రత్యేక డ్రైవ్ తరువాయి 2 వ పేజీలో...



# తెలంగాణ సల్లగుండాలె!

### పాడి పంటలతో వర్ధిల్లాలి.. ప్రగతి పథంలో దూసుకుపోవాలి

### బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్.. రాష్ట్ర ఆవిర్భావ శుభాకాంక్షలు

హైదరాబాద్, జూన్ 1 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ (జూన్ 2) పర్వదినాన్ని పురస్కరించుకుని బీఆర్‌ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు కీలక ప్రకటన చేశారు. రాష్ట్ర ప్రజలకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలంగాణ బిడ్డలకు హృదయపూర్వక ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర సాధన పోరాటంలో తరువాయి 2 వ పేజీలో...




బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,704 |
| వెండి (కిలో): | రూ.2,90,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,851 |

# ఆంధ్రా విగ్రహాలు పార్సిల్ చేస్తం

### ఏపీ సంస్కృతిని రుద్దితే ఊరుకోం.. తెలంగాణ అస్తిత్వమే మా లక్ష్యం

### మాది టీఆర్‌ఎస్ 2.0.. జాగ్రత్త.. మా జోలికొస్తే మూతి పళ్లు రాలుతాయ్

### రాష్ట్రంలో ఆంధ్రా నాయకుల ఏజెంట్ సీఎం.. కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు

తెలంగాణపై ఆంధ్ర నేతలు చేస్తున్న వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఈ వ్యాఖ్యలపై తెలంగాణలోని రాజకీయ నాయకులు, ఉద్యమ నేతలు, మేధావులు తీవ్రంగా మండిపడుతున్నారు. తాజాగా హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన (టీఆర్‌ఎస్) పార్టీ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షలు - సాధన సమావేశంలో ఆ పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

హైదరాబాద్, జూన్ 1 (ఈవార్తలు): తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంతోపాటు.. ఆంధ్రప్రదేశ్‌లోని అధికారంలో ఉన్న టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి నేతలపై నా ఆమె తీవ్ర విమర్శలు గుప్పించారు. తాను చాలా మొండిదాన్ని అని.. మీరు అనుకున్నంత మంచిదాన్ని కాదని కవిత తేల్చి చెప్పారు. తెలంగాణలో టీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన వెంటనే తెలంగాణలో ఉన్న ఆంధ్రా నేతల విగ్రహాలు పగలగొట్టి, ఆంధ్రాకు పార్సిల్ పంపిస్తామని సంచలన తరువాయి 2 వ పేజీలో...





# చలాన్ కట్టకపోతే చెండాడుతారు!

హైదరాబాద్, జూన్ 1 (ఈవార్తలు): ట్రాఫిక్ ఉల్లంఘనులపై రాష్ట్ర ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. ఈ మేరకు వాహనదారులకు రాష్ట్ర ప్రభుత్వం కీలక సూచనలు చేసింది. ఇక నుంచి ట్రాఫిక్ చలాన్ల సమాచారాన్ని ఎప్పటికప్పుడు పక్కాగా ఓనర్లకు చేరేలా తెలంగాణ రవాణా శాఖ సరికొత్త నిబంధనను అమలులోకి తీసుకొచ్చింది. ట్రాఫిక్ చలాన్లకు సంబంధించిన అలర్ట్స్‌ను ఎప్పటికప్పుడు పొందేందుకు ప్రతీ ఒక్కరూ తమ వివరాలను వెంటనే వెబ్‌సైట్‌లో అప్‌డేట్ తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



తండ్రి ప్రేమ పర్వతాలను కూడా కదిలించగలదు. 2016లో, ఇంగ్లాండ్‌లోని డెవన్‌కు చెందిన మార్క్ కార్టర్ తన కుమారుడు బెన్.. తీవ్ర ఆటిజంతో బాధపడేవాడు. ఒక నిర్దిష్టమైన టామీ టిప్పీ నీలి రంగు సిప్పీ కప్పు తప్ప మరే కప్పులోనూ నీరు తాగేవాడు కాదు. అయితే, ఆ కప్పు ఉత్పత్తిని సదరు కంపెనీ నిలిపివేసింది. దీంతో కొడుకు కోసం కార్టర్.. ట్విట్టర్‌లో తిరిగి ఆ కప్పు ఉత్పత్తిని తిరిగి ప్రారంభించాలని కంపెనీకి అభ్యర్థన పెట్టాడు. వెంటనే.. టామీ టిప్పీ సంస్థ చైనాలోని ఒక ఫ్యాక్టరీలో ఆ అసలు మోల్డ్‌ను గుర్తించింది. అది ఇంకా ఆహార వినియోగానికి సురక్షితమని నిర్ధారించిన తర్వాత, సంస్థ మళ్లీ ఉత్పత్తిని ప్రారంభించింది. బెన్‌కు అవసరమైనంతకాలం ఉపయోగపడేలా 500 అదే తరహా కప్పులను తయారు చేసింది.

# పవన్ సభకు అనుమతి నిరాకరణ

ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌కు షాక్ తగిలింది. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా.. జనసేన పార్టీ హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన సభకు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఈ సభకు తెలంగాణ పోలీసులు అనుమతి నిరాకరించారు. తెలంగాణ నవ నిర్మాణ సంకల్ప సభ నిర్వహించాలని జనసేన పార్టీ ప్లాన్ చేయగా.. దానికి పవన్ కళ్యాణ్ హాజరు కానుండగా.. ఈ నేపథ్యంలోనే ఇప్పుడు సైబరాబాద్ పోలీసులు అనుమతి ఇవ్వకపోవడంతో జనసేన నేతల్లో తీవ్ర ఆందోళన నెలకొంది.



హైదరాబాద్, జూన్ 1 (ఈవార్తలు): త్వరలో జరగనున్న గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ఎన్నికల్లో జనసేన పార్టీ పోటీ చేయాలని భావిస్తుండగా.. ఇందుకోసం రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా కార్యక్రమం నిర్వహించాలని జనసేన నిర్ణయించుకుంది. ఈ క్రమంలోనే గచ్చిబౌలిలోని సంధ్య కన్వెన్షన్ హాల్‌లో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు తెలంగాణ నవ నిర్మాణ సంకల్ప సభను నిర్వహించేందుకు ఇప్పటికే -2 వ పేజీలో...



# అమల్లోకి భారత్- ఒమన్ ఒప్పందం

## భారత్‌కు తీరనున్న హర్మూజ్ కష్టాలు

### పలు దిగుమతులకు సుంకాలు రద్దు.. ఒమన్ విస్తరించనున్న భారత మార్కెట్

న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలతో అంతర్జాతీయ చమురు సరఫరాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిలో నౌకల రాకపోకలు నిలిచిపోయి భారత్ ఇబ్బందికర పరిస్థితులను ఎదురోంటోంది. ఈ పరిణామాల నేపథ్యంలో భారత్-ఒమన్‌ల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం జూన్ 1 నుంచి అమల్లోకి రావడం ప్రాధాన్యత సంతరించుకుంది. గతేడాది డిసెంబరులో కుదిరిన ఈ ఒప్పందం వల్ల హర్మూజ్‌పై ఆధారపడకుండా ఇంధన దిగుమతుల కోసం భారత్‌కు ప్రత్యామ్నాయం దొరికినట్లేనని నిపుణులు భావిస్తున్నారు. గతేడాది డిసెంబరులో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఒమన్ పర్యటన సందర్భంగా ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని తరువాయి 2 వ పేజీలో...




# కాళ్లూచేతులు నరికేస్తేనే దారికొస్తరు!

### అలాంటి శిక్షలకే జనం భయపడతారు

### కర్ణాటక హైకోర్టు సంచలన వ్యాఖ్యలు

బెంగళూరు: చట్టాలంటే జనాలకు భయం లేకుండా పోయిందని, కఠిన శిక్షలు వేయకపోవడం వల్లే ప్రజలు అలవాటుగా మార్చుకుని రోజువారీ నేరాలకు పాల్పడుతున్నారని కర్ణాటక హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. అత్యాచారం కేసులో నిందితుడు (గోపి రెడ్డి కార్తీక్ రెడ్డి తరువాయి 2 వ పేజీలో...

# రాశి ఫలాలు



2.6.2026

మేషం: ఇంటా బయట పని ఒత్తిడులు పెరుగుతాయి. ఆదాయ మార్గాలు తగ్గుతాయి. వృత్తి వ్యాపారాలలో శ్రమానంతరం పనులు పూర్తి అవుతాయి. వృధా ప్రయాణాలు చేయవలసి వస్తుంది. నిరుద్యోగులకు ఉద్యోగ ప్రయత్నాలు కలిసిరావు. జీవిత భాగస్వామితో వివాదాలు కలుగుతాయి.

వృషభం: చేపట్టిన పనులు విజయవంతంగా పూర్తవుతాయి. బంధుమిత్రుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. నూతన వ్యాపారానికి పెట్టుబడులు అందుతాయి. స్థిరాస్తి కొనుగోలు చేస్తారు. వ్యాపారాలలో గందరగోళ పరిస్థితులు ఉంటాయి.

మిథునం: సమాజంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. నూతన కార్యక్రమాలు చేపడతారు. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. నిరుద్యోగులకు నూతన ఉద్యోగావకాశాలు లభిస్తాయి. వృత్తి, వ్యాపారాలు గతం కంటే మెరుగ్గా ఉంటాయి. ఆర్థిక పురోగతి కలుగుతుంది.

కర్కాటకం: పాత ఋణాలు తీర్చడానికి నూతన ఋణాలు చేస్తారు. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. ఇంటాబయటా గందరగోళ పరిస్థితులుంటాయి. మిత్రులతో కలహ సూచనలు ఉన్నవి. వృత్తి, వ్యాపారాలలో తొందరపాటు నిర్ణయాలు చేయడం మంచిది కాదు. అధికారులతో అప్రమత్తంగా వ్యవహరించాలి.

సింహం: ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. ముఖ్యమైన పనులు వాయిదా పడతాయి. వృత్తి, వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. మిత్రులతో దూర ప్రయాణ సూచనలు ఉన్నవి. కుటుంబ సభ్యుల ప్రవర్తన చికాకు కలిగిస్తుంది. ధన పరంగా ఇతరులకు మాట ఇవ్వటం మంచిది కాదు.

కన్య: దూరపు బంధువులు కలుసుకుని పాత విషయాలు చర్చిస్తారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ధన సహాయం అందిస్తారు. సమాజంలో పేరు కలిగిన వ్యక్తులతో పరిచయాలు పెరుగుతాయి. చేపట్టిన పనులు సకాలంలో పూర్తవుతాయి. వ్యాపార, ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుతాయి.

తుల: ఆర్థిక అనుకూలత పెరుగుతుంది. గృహమున కీలక నిర్ణయాలు అమలు చేస్తారు. విలువైన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. కొత్త వ్యక్తులతో పరిచయాలు విస్తృతం అవుతాయి. సోదరుల నుండి శుభవార్తలు అందుకుంటారు. వృత్తి, వ్యాపారాలు మరింత ఉత్సాహంగా సాగుతాయి.

వృశ్చికం: వృథా ఖర్చులు పెరుగుతాయి. దూర ప్రయాణాలలో వాహన ఇబ్బందులు ఉంటాయి. స్వల్ప అనారోగ్య సూచనలు ఉన్నవి. ముఖ్యమైన వ్యవహారాలలో ఆటంకాలు కలుగుతాయి. వృత్తి, వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఉద్యోగ విషయంలో కొంత ఒత్తిడి తప్పదు.

ధనస్సు: కొన్ని వ్యవహారాలు శ్రమతో గాని పూర్తికావు. వృత్తి వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. నిరుద్యోగుల ప్రయత్నాలు నిరాశ కలిగిస్తాయి. ఆదాయ మార్గాలు పెరుగుతాయి. అవసరానికి చేతిలో డబ్బు నిల్వ ఉండదు. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

మకరం: చిన్ననాటి మిత్రులతో విందు వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు. స్థిరాస్తి వివాదానికి సంబంధించి విలువైన సమాచారం అందుతుంది. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. చేపట్టిన పనులు చకచకా సాగుతాయి. అధికారుల సహాయంతో పదోన్నతులు పెరుగుతాయి. వృత్తి, వ్యాపారాలు అనుకూలిస్తాయి.

కుంభం: ఆరోగ్య సమస్యలు కొంత బాధిస్తాయి. కీలక వ్యవహారాలలో స్వల్ప అవరోధాలు కలుగుతాయి. వృధా ఖర్చులు పెరుగుతాయి. కుటుంబ వాతావరణం గందరగోళంగా ఉంటుంది. వ్యాపారాలు నత్తనడకన సాగుతాయి. ఉద్యోగాలలో సహోద్యోగుల ప్రవర్తన మానసిక బాధను కలిగిస్తుంది.

మీనం: కొన్ని వ్యవహారాలలో కీలక నిర్ణయాలు అమలు చేస్తారు. చేపట్టిన పనులు విజయవంతంగా పూర్తి అవుతాయి. దైవ సేవా కార్యక్రమాలకు ధనసహాయం అందిస్తారు. కుటుంబంలో శుభకార్యాలు నిర్వహిస్తారు. ఆర్థికంగా పురోగతి కలుగుతుంది. వృత్తి, వ్యాపారాలు ఉత్సాహవంతంగా సాగుతాయి.



# తల తాకట్టు పెడతా!

మొదటి పేజీ తరువాయి

నిర్వహించి వంద శాతం ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. గుడిసెలు లేని ఆదిలాబాద్ జిల్లాను తాను చూడాలనుకుంటున్నానని తెలిపారు. సెప్టెంబర్ 17వ తేదీన రాష్ట్రంలో మరో లక్ష ఇందిరమ్మ ఇళ్లకు గృహ ప్రవేశాలు చేస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. కేసీఆర్ చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టులో ఖర్చు చేసిన రూ. లక్ష కోట్లు గోదావరి నదిలో కలిసిపోయాయని మండిపడ్డారు. గత 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో ఆదిలాబాద్ జిల్లాలోని ప్రాజెక్టులను పట్టించుకోలేదని ఆరోపించారు. తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మించి.. ఆదిలాబాద్ జిల్లాలోని 2 లక్షల ఎకరాలకు నీళ్లు ఇస్తామని హామీ ఇచ్చారు. తుమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణం కోసం చర్చించేందుకు మహారాష్ట్ర ముఖ్యమంత్రికి ఎన్నో లేఖలు రాసినట్లు గుర్తు చేసిన సీఎం రేవంత్ రెడ్డి.. అయినా ఎలాంటి స్పందన లేదని విమర్శించారు.

తెలంగాణ సీఎం అంటే మహారాష్ట్ర సీఎంకు ఎందుకు అంత చిన్నచూపు అని ప్రశ్నించారు. ఈ సమస్య పరిష్కారానికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టు కోసం తెలంగాణలోని 7 గ్రామాలను ఆంధ్రప్రదేశ్‌లో కలిపిన విషయాన్ని గుర్తు చేసిన రేవంత్ రెడ్డి.. తుమ్మిడిహట్టి ప్రాజెక్టు వల్ల మహారాష్ట్రకు కలిగే నష్టాన్ని తామే భరిస్తామని.. మహారాష్ట్ర నుంచి 2 వేల ఎకరాలు మాత్రమే అడుగుతున్నట్లు చెప్పారు. ఇక తెలంగాణలో ఇప్పటి వరకు 62 లక్షల క్వింటాళ్ల వడ్లను తమ ప్రభుత్వం కొనుగోలు చేసినట్లు రేవంత్ రెడ్డి వెల్లడించారు. మొత్తం 75 లక్షల క్వింటాళ్ల వడ్లను కొంటామని స్పష్టం చేశారు. ఈనెల 15వ తేదీ నాటికి ఈ కొనుగోళ్లు పూర్తి అవుతాయని తెలిపారు. తాము సేకరించిన వడ్లు, మక్కలు, జొన్నలను కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అందుకు కిషన్‌రెడ్డి సహకారం అందించాలని.. వడ్లు కొనకపోతే ఈనెల 15వ తేదీ తర్వాత కేంద్రంపై యుద్ధం చేస్తామని రేవంత్ రెడ్డి తీవ్ర హెచ్చరికలు చేశారు.

## అమల్లోకి భారత్- ఒమన్ ఒప్పందం

మొదటి పేజీ తరువాయి

మరింత బలోపేతం చేసుకునే దిశగా అడుగులుపడ్డాయి. భారత్, ఒమన్ మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై ఇరు దేశాల ప్రతినిధులు సంతకాలు చేశారు. ఆ ఒప్పందం జూన్ 1 నుంచి అమల్లోకి వచ్చినట్లు వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ ప్రకటించారు. దీని ప్రకారం పలు దిగుమతులకు సుంకాలను మినహాయించాయి. ఇకపై భారత్ ఎగుమతి చేసే 99.38 శాతం ఉత్పత్తులకు ఎటువంటి సుంకం ఉండదు. ఈ జాబితాలో ఆభరణాలు, రత్నాలు, టెక్స్‌టైల్స్, లెదర్, ఫుట్‌వేర్, ప్లాస్టిక్స్, వ్యవసాయ, ఇంజనీరింగ్ ఉత్పత్తులు, మెడిసిన్, వైద్య పరికరాలు, ఆటోమొబైల్ వంటివి ఈ ఉన్నాయి. సుంకాల మినహాయింపులతో భారతీయ ఉత్పత్తులకు ఒమన్‌లో మార్కెట్ విస్తరించనుంది. అలాగే, ఆ దేశం నుంచి భారత్ దిగుమతి చేసుకునే ఉత్పత్తుల్లో 78శాతం వస్తువులకు సుంకాలను మినహాయించారు. ప్రపంచ ఇంధన రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిలో అమెరికా-ఇరాన్ యుద్ధంతో నౌకల రవాణాకు అంతరాయం ఏర్పడింది. కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినా.. హర్మూజ్‌లో అమెరికా, ఇరాన్ సైన్యాల మధ్య ఘర్షణ మాత్రం కొనసాగుతోంది. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అమల్లోకి రావడంతో హర్మూజ్‌కు ప్రత్యామ్నాయంగా గల్ఫ్ దేశాల నుంచి భారత్ చమురు దిగుమతులు పెంచుకునే అవకాశాలు లభించినట్టయ్యింది. ఒమన్ తీరంలో అధిక భాగం గల్ఫ్ ఆఫ్ ఒమన్, అరేబియా సముద్రానికి ఆనుకుని హర్మూజ్ జలసంధికి వెలుపలే ఉంటుంది. కాబట్టి హర్మూజ్‌లో రవాణాకు అంతరాయం ఏర్పడిన సమయల్లో సలాలా, దుఖ్మ్ వంటి పోర్టుల ద్వారా భారత్ చమురు దిగుమతి చేసుకునే వీలుంటుందని గ్లోబల్ ట్రేడ్ రిసెర్చ్ ఇనిషియేటివ్ ఫౌండర్ అజయ్ శ్రీవాస్తవ్ పేర్కొంది. ఇప్పటికే ఈ నౌకాశ్రయాల నుంచి చమురు దిగుమతులను భారత్ పెంచింది. ఏప్రిల్ 2025లో గల్ఫ్ దేశాల నుంచి 15 బిలియన్ డాలర్ల మేర విలువైన ఉత్పత్తులను భారత్ దిగుమతి చేసుకుంది. కానీ, అమెరికా ఇరాన్ యుద్ధంతో ఉద్రిక్తతల కారణంగా ఈ ఏడాది ఏప్రిల్‌లో వాటి సంఖ్య 9.8 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. ఇదే సమయంలో ఒమన్ నుంచి భారత్ దిగుమతులు ఏకంగా 246.4 శాతం మేర పెరిగి 1.5 బిలియన్ డాలర్లకు చేరుకోవడం విశేషం. వీటిలో క్రూడాయిల్, ఎరువులే అత్యధికం కావడం గమనార్హం. గత ఆర్థిక సంవత్సరంలో (2025-26 ) ఒమన్ నుంచి భారత్ 7.2 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తులను దిగుమతి చేసుకుంది. వీటిలో చమురు 1.6 బిలియన్ డాలర్లు కాగా.. ఎల్ఎన్‌జీ 1.2 బిలియన్ డాలర్లు. అలాగే, ఆ దేశానికి భారత్ ఎగుమతుల విలువ 3.64 బిలియన్ డాలర్లుగా ఉంది. వీటిలో శుద్ధిచేసిన పెట్రోలియం ఉత్పత్తులు, ఉక్కు, స్టీల్, బియ్యం వంటివి ఎక్కువగా ఉన్నాయి.

## చలాన్ కట్టకపోతే చెండాడుతారు!

మొదటి పేజీ తరువాయి

చేసుకోవాలని స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన కొత్త నిబంధనల ప్రకారం.. ప్రతీ ఒక్క వాహనదారుడు తమ మొబైల్ నంబర్, వాట్సాప్ నంబర్, ఈ-మెయిల్ ఐడీ వంటి వివరాలను నెల రోజుల్లోగా కేంద్ర ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్ వాహన్ పోర్టల్‌లో తప్పనిసరిగా అప్‌డేట్ చేసుకోవాలని రవాణా శాఖ ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వం ఇచ్చిన నెల రోజుల గడువు ముగిసిన తర్వాత.. వాహన్ పోర్టల్‌లో నమోదై ఉన్న సెల్ నంబరు, ఈ-మెయిల్‌కు ఎస్ఎంఎస్, వాట్సాప్, మెయిల్ ద్వారా ట్రాఫిక్ చలాన్లను సంబంధిత వాహన యజమానికి పంపిస్తారు. ఇలా పంపిన ట్రాఫిక్ చలాన్లు వారికి అందినట్లుగానే రాష్ట్ర ప్రభుత్వం భావిస్తుంది. ఇంతకుముందులా, తమ ఫోన్‌కు ట్రాఫిక్ చలాన్ రాలేదని, దానికి సంబంధించి మెసేజ్ కూడా రాలేదని, అసలు తమ బండిపై ట్రాఫిక్ చలాన్ ఉందనే సమాచారం కూడా తమకు తెలియదని వాహనదారులు చలాన్లు తప్పించుకోవడానికి వీలు ఉండదని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. గతంలో ఇలాంటి సాకులు చెప్పి.. కొందరు వాహనదారులు ట్రాఫిక్ చలాన్లు కట్టకుండా తప్పించుకునే వారని తెలిపాయి. పెండింగ్‌లో ఉన్న ట్రాఫిక్ చలాన్ల వసూళ్లను మరింత వేగంగా వసూలు చేయడానికి.. ట్రాఫిక్ చలాన్ల విషయంలో మరింత పారదర్శకతను పెంచడానికి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

## జోరుగా జీఎస్టీ వసూళ్లు

మొదటి పేజీ తరువాయి

ముగింపు తర్వాత మే నెలలో వసూళ్లు తగ్గడం సాధారణమేనని అధికారులు తెలిపారు. ఈసారి జీఎస్టీ వసూళ్లలో దిగుమతులు కీలక పాత్ర పోషించాయి. దేశీయ లావాదేవీల ద్వారా వచ్చిన జీఎస్టీ ఆదాయం 2.6 శాతం తగ్గి సుమారు రూ.1.34 లక్షల కోట్లుగా నమోదు కాగా.. దిగుమతులపై జీఎస్టీ వసూళ్లు 19.1 శాతం పెరిగి రూ.59,654 కోట్లకు చేరుకోవడం గమనార్హం. మే నెలలో మొత్తం రిఫండ్‌లు 2.6 శాతం పెరిగి రూ.27,281 కోట్లుగా నమోదయ్యాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2026-27) తొలి రెండు నెలల్లో (ఏప్రిల్-మే) స్థూల జీఎస్టీ వసూళ్లు 6.2 శాతం వృద్ధితో రూ.4.37 లక్షల కోట్లకు చేరాయి.

## తెలంగాణ సల్లగుండాలె!

మొదటి పేజీ తరువాయి

అసువులు బాసిన అమరవీరుల త్యాగాలను కేసీఆర్ స్మరించుకుంటూ నివాళులు అర్పించారు. తెలంగాణ ప్రజల మీద దశాబ్దాల పాటు సాగిన అణచివేతపై పోరాడి, అనేక ఆవాంతరాలను అధిగమించి, శాంతియుతమైన పార్లమెంటరీ పంథాలో, ప్రజాస్వామ్య యుతంగా కొట్లాడి స్వరాష్ట్రాన్ని సాధించుకున్నామని తెలిపారు. ఉమ్మడి పాలనలో తీవ్ర వివక్షకు గురై, దిక్కుతోచని స్థితిలో ఉన్న తెలంగాణను స్వయం పాలనలో ఒక దిక్సూచిలా మార్చుకున్నామని, పరిపాలన చేతగాదు' అని విమర్శించిన నోళ్లు మూతపడేలా ప్రగతి పాలనను అందించామని కేసీఆర్ అన్నారు. నూతన రాష్ట్రంగా ఏర్పాటైన పదేండ్ల అనతికాలంలోనే సకల జనుల సంక్షేమం, సమస్త రంగాల సమగ్ర ప్రగతిని సాధించి, తెలంగాణను దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుకున్నామని వివరించారు. తెలంగాణ రాష్ట్రం నిరంతరం ప్రగతి పథంలో దూసుకుపోవాలని, పచ్చని పాడి పంటలతో వర్ధిల్లాలని కేసీఆర్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆకాంక్షించారు. రైతాంగం, శ్రమజీవులు, సబ్బండ వర్గాలు,సకల జనుల జీవితాలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో నిండాలని కేసీఆర్ ఈ సందర్భంగా కోరుకున్నారు.

## కాళ్లూచేతులు నరికేస్తేనే దారికొస్తరు!

మొదటి పేజీ తరువాయి

వర్సెస్ స్టేట్ ఆఫ్ కర్ణాటక) బెయిల్ పిటిషన్‌ను తిరస్కరిస్తూ కోర్టు పై విధంగా స్పందించింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో తమకు లభించిన హక్కులను ప్రజలు దుర్వినియోగం చేస్తున్నారని జస్టిస్ ఆర్. నటరాజ్ అభిప్రాయపడ్డారు. 'బహుశా అరబ్ దేశాల తరహాలో తప్పు చేసిన వారి కాళ్లు, చేతులు నరికేసే కఠినమైన శిక్షలు ఉంటేనే, ఇక్కడి ప్రజలు చట్టాలను గౌరవిస్తారేమో" అని ఆయన వ్యాఖ్యానించారు. "నేరస్తులను కఠినంగా శిక్షించకపోవడం వల్లే చట్టం తన పదునైన కోరలను కోల్పోయింది. అందుకే పశ్చిమాసియా దేశాలు (అరబ్ దేశాలు) మాదిరిగా కాకుండా ఇక్కడ నేరం చేయడం చాలా సులభం అయిపోయింది. కాలో లేదా చెయ్యో నరికేస్తేనే బహుశా అప్పుడు చట్టాన్ని పాటించాలనే నిజాన్ని ప్రజలు గ్రహిస్తారు. మనది ప్రజాస్వామ్యం కావడం వల్ల, ప్రతి ఒక్కరూ దీనిని చాలా తేలికగా తీసుకుంటున్నారు' అని జస్టిస్ నటరాజ్ అన్నారు. మణిపాల్ ఎంఐటీ విద్యార్థి గోపిరెడ్డి కార్తీక్ రెడ్డి దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ విచారణ సందర్భంగా కోర్టు ఈ ఘాటైన వ్యాఖ్యలు చేసింది. అత్యాచారం ఆరోపణలపై అతను ఏప్రిల్ 5 నుంచి జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నాడు. 'ఉప్పు తిన్నప్పుడు నీళ్లు తాగక తప్పదు. మరో నాలుగు ఐదు రోజులు అతడ్ని జైల్లోనే ఉండనివ్వండి. అక్కడి వాతావరణానికి అలవాటు పడనివ్వండి.. ఒకవేళ శిక్ష పడితే మళ్లీ జైలుకే వెళ్లాల్సి వస్తుందని అతడికి తెలుస్తుంది' అని పేర్కొంటూ నిందితుడికి బెయిల్ ఇచ్చేందుకు కోర్టు నిరాకరించింది. అనంతరం ఈ బెయిల్ పిటిషన్‌పై రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేస్తూ, తదుపరి విచారణను జూన్ 8కి వాయిదా వేసింది.

## పవన్ సభకు అనుమతి నిరాకరణ

మొదటి పేజీ తరువాయి

జనసేన పార్టీ నేతలు ఏర్పాట్లు చేశారు. ఈ సమయంలోనే ఈ సభకు పోలీసుల అనుమతి లేకపోవడం ఆ పార్టీకి ఎదురుదెబ్బగా మారింది. దీంతో జనసేన పార్టీ నేతలు న్యాయపోరాటం చేసేందుకు రెడీ అయినట్లు తెలుస్తోంది. పోలీసుల నిర్ణయంపై కోర్టును ఆశ్రయించాలని భావిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే తెలంగాణలోని అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన నేతలు పవన్ కల్యాణ్‌పై తీవ్ర విమర్శలు గుప్పిస్తున్న వేళ ఈ సభ ఏర్పాటు చేయడం, దానికి పోలీసులు అనుమతి నిరాకరించడం గమనార్హం.

# ఆంధ్రా విగ్రహాలు పార్సిల్ చేస్తం

మొదటి పేజీ తరువాయి

వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ అస్తిత్వంపై దాడి చేస్తూ.. ఏపీ సంస్కృతిని తమపై రుద్దుతామంటే చూస్తూ ఊరుకునేది లేదంటూ.. కల్వకుంట్ల కవిత ఘాటు వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రాష్ట్ర అస్తిత్వాన్ని కాపాడటమే తమ ప్రధాన లక్ష్యమని కవిత తేల్చి చెప్పారు. టీఆర్ఎస్ రాకముందు ఒక లెక్క ఇప్పుడు ఒకలెక్క అంటూ వార్నింగ్ ఇచ్చారు. ఇది టీఆర్ఎస్ 2.0 అని.. తమతో పెట్టుకుంటే మంచిగా ఉండదని స్పష్టం చేశారు. ఒకసారి తెలంగాణతో పెట్టుకుంటేనే రాష్ట్రాన్ని తెచ్చుకున్నామని.. మళ్లీ తమ జోలికి వస్తే ఊరుకోమని, మూతి పళ్లు రాలుతాయని హెచ్చరించారు. ఇక సీఎం రేవంత్ రెడ్డిపై పరోక్షంగా విమర్శలు గుప్పించిన కవిత.. తెలంగాణలో ఆంధ్రా రాజకీయ నాయకుల ఏజెంట్ ముఖ్యమంత్రిగా ఉన్నారనీ.. అందునే ఆంధ్రా నాయకుల విగ్రహాలు పెడుతూ.. ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఇదేదో యాదృచ్ఛికంగా జరుగుతున్నది కాదని.. ఒక పక్కా ప్రణాళిక ప్రకారం తెలంగాణ అస్తిత్వంపై కుట్ర చేస్తున్నారని కవిత తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రొఫెసర్ నాగేశ్వర్, పాశం యాదగిరి లాంటి మేధావులు మాట్లాడితే ఆంధ్రా పోలీసులు వచ్చి



ఎదురుదాడి చేస్తున్నారని తీవ్రంగా మండిపడ్డారు. ఇక రాష్ట్రం విడిపోయి 13 ఏళ్లు అవుతున్నా ఏపీలో రాజధానిని కట్టుకోవడం చేతగాక.. అక్కడి ప్రజలను డైవర్ట్ చేయడానికి ఇక్కడ డ్రామాలు చేస్తున్నారని ఆరోపించారు. రాజధాని నిర్మాణంలో పూర్తిగా ఫెయిల్ అయ్యారని ఎద్దేవా చేశారు.

### మా కథలు మేం పడ్తం.. మీ పని మీరు చూస్కోండి

'తెలంగాణ నవనిర్మాణానికి పవన్ కళ్యాణ్ వచ్చి ఇక్కడ సభ పెడతాడంట. నేను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నా. వానాకాలం వస్తోంది. మీ అమరావతిలో, మీ సెక్రటేరియట్లో, మీ ముఖ్యమంత్రి గారి కుర్చీ కిందకు నీళ్లు రాకుండా చూసుకోండి ఫస్ట్. ప్రతి వానాకాలం అక్కడ రాజధాని మునుగుతుంది. ఇది ఆంధ్రా ప్రజలకు ఎంత అవమానం. ఆంధ్రా నాయకులు ఆరోగ్యం బాగాలేకపోతే ఇప్పటికీ హైదరాబాద్ వచ్చి ఆపరేషన్లు చేయించుకుంటారు. 12 ఏళ్లు అయ్యింది.. అక్కడే ఆస్పత్రి కట్టుకోవచ్చుగా. మీరంటే కార్లు ఉన్నాయ్ వచ్చేస్తారు. ప్రజల సంగతి ఏంటి? వాళ్లు ఎక్కడికి పోవాలి? చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ పోవాలి. ఇన్నేళ్లయినా కూడా మీ ప్రజలకు కావాల్సిన ఆస్పత్రులు కట్టరు. వసతులు కల్పించరు. మీ రాజకీయ అవసరాల కోసం మాత్రం తెలంగాణ మీద పడి ఏడుస్తారా?' అంటూ తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. 'మా పని మేము చేసుకుంటాం.. మా నిర్మాణం మేము చేసుకుంటాం.. మా కథలు మేం పడ్తం.. రాష్ట్రం విడిపోయినా, ప్రజలు విడిపోలేదు. ప్రజల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నాలు మానుకోండి. అలా చేస్తే మంచిగా ఉండదు. ఈసారి మూతిపళ్లు రాలిపోతాయ్' అంటూ వార్నింగ్ ఇచ్చారు.

# నేడు 3 నోటిఫికేషన్ల విడుదల

**నిరుద్యోగులకు సర్కారు గుడ్‌న్యూస్**

హైదరాబాద్, జూన్ 1 (ఈవార్తలు): తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2వ తేదీన నిరుద్యోగులకు శుభవార్త చెప్పేందుకు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) రెడీ అయింది. ఈ నేపథ్యంలోనే రేపు ఒక్కరోజే 3 రకాల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ చేయనున్నట్లు టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం తాజాగా వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేసే ప్రక్రియలో వేగాన్ని పెంచడంతో పాటు.. ఎలాంటి అవకతవకలు లేకుండా పరీక్షల నిర్వహణలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్నట్లు ఆయన ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి 3,800 ఖాళీ పోస్టుల భర్తీకి అనుమతులు వచ్చినట్లు టీజీపీఎస్సీ చైర్మన్ వెల్లడించారు. ఇందులో అటవీ శాఖలో ఖాళీగా ఉన్న 3,093 పోస్టులను భర్తీ చేస్తామని ప్రకటించారు. ఇక వివిధ శాఖల్లో ఒక్కో పోస్ట్ చొప్పున 25 ఖాళీలు ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలోని వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ కోసం ఇక నుంచి రెగ్యులర్‌గా నోటిఫికేషన్లను టీజీపీఎస్సీ విడుదల చేస్తుందని స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే ప్రతి నెల సగటున 3




నోటిఫికేషన్లను జారీ చేసినట్లు చెప్పారు. ఈ క్రమంలోనే తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం 3 కొత్త నోటిఫికేషన్లను రిలీజ్ చేస్తున్నట్లు తెలిపారు. ఇక నుంచి టీజీపీఎస్సీ ఏ ఉద్యోగ నియామక ప్రక్రియ ప్రారంభించినా.. దాన్ని గరిష్ఠంగా ఒక సంవత్సరం లోపే పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు చైర్మన్ బుర్రా వెంకటేశం స్పష్టం చేశారు. అదే సమయంలో ఇక నుంచి టీజీపీఎస్సీ నిర్వహించే అన్ని నియామక పరీక్షలను పూర్తిగా కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) విధానంలోనే నిర్వహించనున్నట్లు తేల్చి చెప్పారు. సీబీటీ వల్ల పేపర్ లీకేజీలకు అవకాశం ఉండదని.. పరీక్ష పేపర్‌ను ముందే తయారు చేయడం అనేది కూడా ఇక నుంచి ఉండదని చెప్పారు. ఇక అభ్యర్థులు పరీక్ష రాసిన వెంటనే వారు ఎన్ని ప్రశ్నలకు సరైన సమాధానాలు రాశారో కూడా తెలిసేలా సరికొత్త టెక్నాలజీని తీసుకురానున్నట్లు ఆయన ఒక హింట్ ఇచ్చారు. ఇక టీజీపీఎస్సీ చేపట్టే ఉద్యోగ నియామకాల్లో మొదట నోటిఫికేషన్ విడుదల.. ఆ తర్వాత పరీక్ష నిర్వహణ.. అనంతరం.. మెరిట్ లిస్ట్ రిలీజ్.. చివరిగా సెలక్షన్ లిస్ట్ అనే దశల్లో కచ్చితంగా పారదర్శక విధానాన్ని పాటిస్తామని బుర్రా వెంకటేశం తేల్చి చెప్పారు. పరీక్ష నిర్వహణలో ఎలాంటి లోపాలు లేవు అనే నమ్మకాన్ని అభ్యర్థుల్లో కలిగించడానికే తాము కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. అదే సమయంలో దరఖాస్తు చేసుకున్న ప్రతీ ఒక్కరికీ ఉద్యోగాలు ఇవ్వడం సాధ్యం కాదని.. వారిలో కేవలం 0.1 శాతం మందికి మాత్రమే ఉద్యోగాలు వస్తాయని తెలిపారు. జాబ్ రాని వారు టీజీపీఎస్సీపై దుష్ప్రచారం చేయడం సహజమేనని.. అయితే మిగిలిన అభ్యర్థులు వాటిని పట్టించుకోవద్దని సూచించారు. కేంద్ర ప్రభుత్వంలోని యూనియన్ పబ్లిక్ సర్వీసెస్ కమిషన్ (యూపీఎస్సీ) అనుసరిస్తున్న అత్యుత్తమ విధానాలనే తెలంగాణలో అవలంబించనున్నట్లు బుర్రా వెంకటేశం స్పష్టం చేశారు. పరీక్షల నిర్వహణకు ప్రతిభా భారతి అనే సరికొత్త పద్ధతిని కూడా తీసుకురానున్నట్లు టీజీపీఎస్సీ చైర్మన్ వెల్లడించారు.

మీరిచ్చే ప్రతి పైసా..
ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811
నంబర్‌ను సంప్రదించవచ్చు.

# 632 మంది పోలీసులకు పతకాలు

**విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ చీఫ్‌కు సర్వోన్నత పోలీసు పతకం**

**భద్రాద్రి కొత్తగూడెం రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ రవి, చెర్ల సీఐ రాజులకు శౌర్య పతకాలు**

**16 మందికి మహోన్నత సేవా పతకాలు**

హైదరాబాద్, జూన్ 1 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా, ఉత్తమ సేవలు అందించిన 632 మంది పోలీసులు, అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం పతకాలను ప్రకటించింది. ఈ మేరకు ఈరోజు వారి పేర్లను ప్రకటించింది. విశిష్ఠ, అత్యుత్తమ మరియు ఉత్తమ సేవలకు గుర్తింపుగా, పోలీస్, విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, అవినీతి నిరోధక బ్యూరో, ప్రత్యేక రక్షణ దళం, అగ్నిమాపక సేవల విభాగాలకు చెందిన సిబ్బందిని వివిధ పతకాలకు ఎంపిక చేశారు. తెలంగాణ రాష్ట్ర విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ చీఫ్ ప్రతాప్‌కు సీఎం సర్వోన్నత పోలీసు పతకం దక్కింది. భద్రాద్రి కొత్తగూడెం రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ రవి, చెర్ల సీఐ రాజులకు తెలంగాణ పోలీస్ శౌర్య పతకాలను ప్రకటించారు. ఇంటెలిజెన్స్ కానిస్టేబుల్ సంపత్, గ్రేహౌండ్స్‌లోని మరో ఏడుగురిని శౌర్య పతకాలు వరించాయి. 16 మందికి మహోన్నత సేవా పతకాలు, 94 మందికి ఉత్తమ సేవా పతకాలు, 50 మంది కఠిన సేవా పతకాలు, మరో 461 మంది సేవా పతకాలు అందుకోనున్నారు.

# బాల్క సుమన్‌పై ఆస్తుల ధ్వంసం సెక్షన్ రద్దు

నాంపల్లి/హైదరాబాద్, జూన్ 1 (ఈవార్తలు): బీఆర్ఎస్ నేత, చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ వ్యవహారంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. బాల్క సుమన్‌పై మొత్తం 3 సెక్షన్లు నమోదు చేయగా.. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేశారనే సెక్షన్ వర్తించదని విచారణ సందర్భంగా నాంపల్లి కోర్టు తేల్చి చెప్పింది. ఈ కేసులో 2 సెక్షన్లు మాత్రమే బాల్క సుమన్‌కు వర్తిస్తాయని కోర్టు స్పష్టం చేసింది. ఈ క్రమంలోనే బాల్క సుమన్‌పై నమోదు చేసిన మిగిలిన సెక్షన్లను కోర్టు రద్దు చేసింది. బాల్క సుమన్ రిమాండ్ రిజెక్ట్ కోరుతూ మెమోను దాఖలు చేశారు. ఇక ఈ కేసులో దేశద్రోహం సెక్షన్‌ను కూడా బాల్క సుమన్‌పై పోలీసులు నమోదు చేయడం తీవ్ర దుమారం రేపుతోంది. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని రాజద్రోహం సెక్షన్ 152ను కూడా పోలీసులు జోడించారు. గత నెల 26వ తేదీన తెలంగాణ భవన్‌లో నిర్వహించిన టీబీజీకేఎస్ సమావేశంలో మాట్లాడిన బాల్క సుమన్.. నాంపల్లిలోని సింగరేణి భవన్‌తోపాటు మందమర్రిలోని సింగరేణి జీఎం కార్యాలయాలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బాల్క సుమన్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించిన సింగరేణి భవన్ అధికారులు ఆయనపై నాంపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. బాల్క సుమన్‌ను అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. ఇక తన అరెస్ట్‌కు ముందు బాల్క సుమన్ మీడియాతో మాట్లాడుతూ సంచలన ఆరోపణలు చేశారు. తనను జైలులో పెట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి వివేక్ వెంకటస్వామి భావిస్తున్నారని పేర్కొన్నారు. తనను జైలుకు తరలించి పైశాచికానందం పొందాలని వారు భావిస్తున్నారని మండిపడ్డారు. ఎమర్జెన్సీ రోజులను కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తు చేస్తోందని విమర్శించారు. తాను చట్టాన్ని గౌరవించే వ్యక్తిని అని.. పోలీసులకు పూర్తిగా సహకరిస్తానని చెప్పారు. తాను ఎక్కడికీ పారిపోలేదని.. పార్టీ కార్యక్రమంలో భాగంగానే తెలంగాణ భవన్‌లో ఉన్నట్లు చెప్పారు.

# జేఈఈలో గురుకులాల సత్తా

**ఐఐటీలకు 163 మంది విద్యార్థులు ఎంపిక**

హైదరాబాద్, జూన్ 1 (ఈవార్తలు): తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ ఆధ్వర్యంలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ విద్యాసంస్థలు మరోసారి అత్యుత్తమ ఫలితాలతో రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచాయి. జేఈఈ మెయిన్స్-2026, జేఈఈ అడ్వాన్స్‌డ్-2026 పరీక్షల్లో గురుకుల విద్యార్థులు సాధించిన ఫలితాలు నాణ్యమైన ప్రభుత్వ విద్యకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచాయి. సొసైటీ పరిధిలోని 37 సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సంస్థల్లో సైన్స్, ఆర్ట్స్ విభాగాలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సీఓఈలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరిచారు. జేఈఈ మెయిన్స్ పరీక్షకు మొత్తం 355 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 61 మంది విద్యార్థులు డైరెక్ట్ ఐఐటీలో సీటు పొందారు. 102 మంది ప్రిపరేటరీ ర్యాంకులు సాధించి మొత్తం 163 మంది ఐఐటీల్లో ప్రవేశాలకు అర్హత సాధించారు. అదేవిధంగా దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్ష అయిన జేఈఈ అడ్వాన్స్‌డ్ లో విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. కమ్యూనిటీ ర్యాంకుల్లోనూ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. 500 లోపు ఒకరు, 1000 లోపు ముగ్గురు, 2000 లోపు 14 మంది, 3000 లోపు 25 మంది, 5000 లోపు 39 మంది విద్యార్థులు కమ్యూనిటీ ర్యాంకులు సాధించి జాతీయ స్థాయిలో తమ సత్తాను నిరూపించారు.

## ఫోన్ ట్యాపింగ్ సంగతేందని

# నా భార్య తిడుతోంది

**కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు**





హైదరాబాద్, జూన్ 1 (ఈవార్తలు): తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ కేసు పెను సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం.. ప్రతిపక్షాలు సహా చాలా మంది ఫోన్లను ట్యాప్ చేయించిందని.. ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. ఈ ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలపై కేసు నమోదు చేసి.. స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్) దర్యాప్తు చేయిస్తోంది. ఇప్పటికే ఈ కేసులో చాలా మందిని అరెస్ట్ చేయగా.. హరీష్ రావు, కేటీఆర్, సంతోష్ రావు సహ మరికొంతమందిని విచారణ జరిపారు. ఈ క్రమంలోనే రాజకీయంగా కూడా ఈ ఫోన్ ట్యాపింగ్ కేసు.. తీవ్ర దుమారం రేపుతోంది. ఈ నేపథ్యంలోనే తాజాగా సీఎల్పీ మీడియా హాల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ నేత, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి .. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై మాట్లాడుతూ.. తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో తన ఫోన్ మాత్రమే కాకుండా తన తల్లి, భార్య ఫోన్ నంబర్లను కూడా ట్యాప్ చేసినట్లు సంచలన ఆరోపణలు చేశారు. మీ భర్తతో మాట్లాడే విషయాలను వేరే వాళ్లు వింటే మీకు ఎలా ఉంటుంది అంటూ ఆయన నిలదీశారు తన తల్లి కూడా పెద్ద రాజకీయ కుటుంబం నుంచి వచ్చారని చెప్పిన అనిరుధ్ రెడ్డి.. తన, తన కుటుంబ సభ్యుల వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించడం తీవ్ర బాధాకరమని పేర్కొన్నారు. ఇక ఈ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంతో తమ ఫ్యామిలీపై తీవ్ర ప్రభావం పడిందని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటికి వెళ్తే తన భార్య తనను తిడుతోందని పేర్కొన్నారు. తన వల్లే ఆమె ఫోన్‌ను కూడా ట్యాప్ చేశారని తన భార్య అడుగుతోందని.. ఆమెకు తాను ఏం సమాధానం చెప్పలేకపోతున్నా అంటూ వాపోయారు. తాను రాజకీయాల్లోకి రావడం వల్లే ఇలాంటి పరిస్థితులు తన కుటుంబం ఎదుర్కోవాల్సి వస్తోందని అనిరుధ్ రెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. తాను వ్యాపారాలు చేసుకుంటూ ఉంటేనే బాగుండేదని.. రాజకీయాల్లోకి ఎందుకు వచ్చానా అని ఇప్పుడు తాను ఆలోచిస్తున్నట్లు కీలక వ్యాఖ్యలు చేశారు. ఇక రాష్ట్రంలో పెను సంచలనంగా మారిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో బాధ్యులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. కచ్చితంగా చర్యలు తీసుకుంటారనే నమ్మకం తనకు ఉందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. అనిరుధ్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

# కూట్లో రాయి తీయలేనోడు.. ఏట్లో రాయి తీస్తాడట

**పవన్‌పై రెచ్చిపోయిన మంత్రి పొన్నం ప్రభాకర్**



హైదరాబాద్, జూన్ 1 (ఈవార్తలు): తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల వేళ జనసేన అధినేత, ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తలపెట్టిన తెలంగాణ నవనిర్మాణ సభ రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతోంది. పవన్ సభపై పలువురు తెలంగాణ నేతలు విమర్శలు చేస్తున్నారు. తాజాగా.. హుస్నాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్.. పవన్ కళ్యాణ్ వైఖరిపై ఘాటుగా విరుచుకుపడ్డారు. గతంలో తెలంగాణ ప్రజల చూపు పడితే కోనసీమ కొబ్బరి చెట్లు ఎండిపోతున్నాయంటూ ఇక్కడి సమాజంపై విషం కక్కిన వ్యక్తి పవన్ అని మంత్రి గుర్తుచేశారు. ప్రత్యేక రాష్ట్రం వస్తే 11 రోజుల పాటు అన్నం తిననని ఏడ్చిన ఇటువంటి తెలంగాణ ద్వేషి, ఇవాళ ఇక్కడికి వచ్చి నవనిర్మాణ సభలు పెడతానంటే తెలంగాణ రక్తం ఉన్న ఏ బిడ్డా ఒప్పుకోదని అన్నారు. పవన్ తక్షణమే ఇక్కడి ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పవన్ కళ్యాణ్ ప్రస్తుతం పూర్తిగా బీజేపీ ఎజెండాను మోస్తున్నారని పొన్నం ఆరోపించారు. తెలంగాణలోని ప్రశాంత వాతావరణాన్ని కలుషితం చేసి, విద్వేషాలు రెచ్చగొట్టే కుట్రతోనే పవన్ ఇక్కడ అడుగుపెడుతున్నారన్నారు. బీజేపీతో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకుని వారి డైరెక్షన్‌లోనే ఈ సరికొత్త రాజకీయ నటనను ప్రారంభించారని విమర్శించారు. బీజేపీ ఇచ్చిన రెమ్యునరేషన్ కోసమే ఇక్కడికి రాలేదని కొండగట్టు అంజన్న స్వామి మీద ప్రమాణం చేసి చెప్పే ధైర్యం పవన్‌కు ఉందా? అని మంత్రి పబ్లిక్ సవాల్ విసిరారు. ఏపీ ప్రజలు అధికారం ఇస్తే అక్కడ ఉపముఖ్యమంత్రిగా చేయాల్సిన నవనిర్మాణాన్ని వదిలేసి.. ఇక్కడ సభలు పెట్టడం వెనుక ఉన్న ఆంతర్యం కేవలం ప్రధాని మోదీని మెప్పించడమేనని అన్నారు. 'కన్నతల్లికి గాజులు కొనలేని వాడు.. పిన తల్లికి ఒడ్డాణం చేయిస్తానన్నాడట.. ఏపీలో కూట్లో రాయి తీయలేని వాడు.. ఇక్కడికి వచ్చి ఏట్లో రాయి తీస్తాడట' అంటూ ఎద్దేవా చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కేంద్రం ప్రైవేటు పరం చేస్తుంటే కళ్ళుఅప్పగించి చూశారని.. కృష్ణపట్నం, గంగవరం పోర్టులను అదానీకి కట్టబెడుతుంటే ప్రశ్నించే చేతగానితనం పవన్ కళ్యాణ్‌దని మండిపడ్డారు. దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం, గ్యాస్, పెట్రోల్ ధరలపై నోరు మెదపని పవన్.. సినిమాల్లో కాకుండా నిజ జీవితంలో దేశభక్తి చూపించాలని హితవు పలికారు.



# ధాన్యం కొనుగోళ్లలో ఎందుకీ నిర్లక్ష్యం

**రేవంత్ ప్రభుత్వానికి రాంచందర్ రావు ప్రశ్న**

న్యూఢిల్లీ: తెలంగాణలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, రైస్ మిల్లర్లతో కుమ్మక్కైందని తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఢిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన.. రాష్ట్రంలో కొనుగోళ్లు సాగుతున్న తీరుపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. "చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని నాడు రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. మరి ఇప్పుడెందుకు ఈ నిర్లక్ష్యం?" అని రాంచందర్ రావు ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా రోడ్లపైనే ధాన్యం కుప్పలు తెప్పలుగా పేరుకుపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే కొనుగోళ్లను ఆలస్యం చేస్తోందని, దిగుబడికి సంబంధించిన సరైన గణాంకాలను కూడా కేంద్ర ప్రభుత్వానికి పంపడంలో విఫలమైందని ఆరోపించారు. రాష్ట్రాలు సేకరించిన ధాన్యానికి మాత్రమే కేంద్రం నిధులు రీయింబర్స్ చేస్తుందని, కానీ రాష్ట్ర ప్రభుత్వ అలసత్వం వల్లే రైతులకు ఈ దుస్థితి దాపురించిందని గుర్తుచేశారు. ధాన్యం తరలింపులో జరుగుతున్న జాప్యంపై బీజేపీ చేసిన ఆందోళనలను ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. బీజేపీ నిరంతరాయంగా చేసిన నిరసనలు, పోరాటాల వల్లే ఎట్టకేలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలకు లారీలను పంపించాల్సి వచ్చిందని అన్నారు. బీజేపీ ఒత్తిడి వల్లే కాంగ్రెస్ ప్రభుత్వం అంతో ఇంతో కదిలిందని చెప్పారు. రైతుల వద్ద మిగిలి ఉన్న ప్రతి ధాన్యం గింజను ఎలాంటి ఆలస్యం లేకుండా తక్షణమే యుద్ధప్రాతిపదికన కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## హైదరాబాద్‌లో

# మరో 6 లేన్ల ఫ్లైఓవర్

**ఎయిర్‌పోర్టు మార్గంలో రూ.416 కోట్లు కేటాయింపు**

హైదరాబాద్, జూన్ 1 (ఈవార్తలు): విశ్వనగరంగా మారుతున్న హైదరాబాద్‌లో ట్రాఫిక్ తగ్గించేందుకు ప్రభుత్వం ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటోంది. వాహనాల రద్దీ ఎక్కువగా ఉండే జంక్షన్లను గుర్తించి.. అక్కడ భారీ ఫ్లైఓవర్లను నిర్మిస్తోంది. ఈ క్రమంలోనే తాజాగా నగరంలో మరో ఫ్లైఓవర్ నిర్మించనున్నారు. ఎల్‌బీ నగర్ జోన్‌లో రూ.416 కోట్లతో 6 లేన్ల ఫ్లైఓవర్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. హైదరాబాద్ నగరంలోని తూర్పు ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. టీకేఆర్ కాలేజీ, గాయత్రీనగర్, మందమల్లమ్మ జంక్షన్ల మీదుగా నిర్మించనున్న ఈ ఫ్లైఓవర్ వల్ల ఎయిర్‌పోర్టు మార్గంలో ట్రాఫిక్ తగ్గనుంది. అంతేకాకుండా మీర్‌పేట్, బడంగ్‌పేట్, అల్మాస్‌గూడ ప్రాంతాలకు మెరుగైన అనుసంధానం లభించనుండగా.. ఎల్‌బీ నగర్ నుంచి పాతబస్తీ వైపు ప్రయాణం కూడా మరింత సులభతరం కానుంది. త్వరలోనే భూసేకరణ, యుటిలిటీ షిఫ్టింగ్ పనులు ప్రారంభం కానున్నాయని సంబంధిత అధికారులు వెల్లడించారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) పరిధిలోని ఎల్‌బీ నగర్ జోన్‌లో రూ.416 కోట్ల వ్యయంతో ఈ 6 లేన్ల ఫ్లైఓవర్ నిర్మాణానికి తాజాగా రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది.



## వీసా మోసం.. కేరళ యువకుడికి
# 38 లక్షల పరిహారం

లండన్: ఉద్యోగం, మంచి భవిష్యత్తు కోసం ఓ భారతీయుడు యూకేకి వెళ్లాడు. కానీ తీరా అక్కడికెళ్లాకు.. వీసా ఇచ్చిన కంపెనీ మోసం చేసింది. దీంతో తినడానికి తిండి, పడుకోవడానికి స్థలం లేక నరకయాతన అనుభవించాడు. చర్చిల్లో తల దాచుకుంటూ.. తనను మోసం చేసిన కంపెనీపై న్యాయ పోరాటం చేశాడు. అయితే అదృష్టవశాత్తు ఈ న్యాయ పోరాటంలో కోర్టు అతడిని గెలిపించింది. విదేశం నుంచి రప్పించుకుని మరీ మోసం చేసిన సదరు కంపెనీకి రూ.38 లక్షల భారీ జరినామా వేసింది. అయితే ఆ మొత్తాన్ని బాధితుడికి నష్ట పరిహారంగా చెల్లించాలని కూడా ఆదేశాలు జారీ చేసింది. యూకేలో హెల్త్‌కేర్ వర్కర్లకు భారీ డిమాండ్ ఉందన్న సమాచారంతో.. కేరళకు చెందిన షాబిన్ షాజీ అనే యువకుడు బ్రిటన్ వెళ్లాలని నిశ్చయించుకున్నాడు. ఇందుకోసం ఒక యూట్యూబ్ ఇన్‌ఫ్లుయెన్సర్ ద్వారా ఇమ్మిగ్రేషన్ ఏజెంట్‌ను సంప్రదించి.. ఏకంగా 17,000 పౌండ్లు (భారత కరెన్సీ ప్రకారం సుమారు రూ. 21.5 లక్షలకు పైగా) ఫీజుగా చెల్లించారు. అనంతరం 'స్వాన్ కేర్ సొల్యూషన్స్ లిమిటెడ్' అనే సంస్థ నిర్వహించిన టెలిఫోన్ ఇంటర్వ్యూ ద్వారా అఫీషియల్ 'సర్టిఫికేట్ ఆఫ్ స్పాన్సర్‌షిప్' పొందారు. దీని ఆధారంగానే ఆయనకు యూకే వీసా లభించింది. ఆ తర్వాత కొన్నాళ్లకే భవిష్యత్తు మీద ఎన్నెన్నో ఆశలతో బ్రిటన్‌లోని స్టాఫోర్డ్‌కు చేరుకున్నాడు షాబిన్. అయితే అక్కడకు వెళ్లాక షాబిన్‌కు ఆ కంపెనీ ఎలాంటి పని కల్పించలేదు. కనీసం ఆశ్రయం కూడా ఇవ్వలేదు. దీంతో అతడికి తిండికి, గూడుకు తీవ్ర ఇబ్బంది మొదలైంది. దీంతో న్యాయ స్థానాన్ని ఆశ్రయించాడు. అయితే ఈ కేసును విచారించిన ఎంప్లాయ్‌మెంట్ జడ్జి కేట్ ఎడ్మండ్స్ సదరు బ్రిటన్ కంపెనీపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'బాధితుడు ఇక్కడికి రావడానికి,




పని ప్రారంభించడానికి చట్టబద్ధంగా చేయాల్సినవన్నీ చేశారు. కానీ యాజమాన్యం అతడికి పని ఇవ్వలేదు. జీతమూ చెల్లించలేదు. కంపెనీ తన ఒప్పంద బాధ్యతలను ఉల్లంఘించి, అతడిని ఒక 'జీరో-అవర్స్' తాత్కాలిక కార్మికుడిగా పరిగణించడానికి ప్రయత్నించింది. ఇది చట్టవిరుద్ధం' అని స్పష్టం చేస్తూ పరిహారంగా రూ. 38 లక్షలు చెల్లించాలని ఆదేశించింది.

## బీజేపీకి అన్నామలై రాజీనామా?

చెన్నై: తమిళనాడు బీజేపీ మాజీ అధ్యక్షుడు కె. అన్నామలై సొంతంగా రాజకీయ వేదికను ఏర్పాటుచేసుకోనున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. పార్టీలో తనకు తగిన ప్రాధాన్యత దక్కకపోవడంతో కొద్ది రోజులుగా ఆయన అసహనంతో రగిలిపోతున్నారు. ఈ నేపథ్యంలో పార్టీలో తనకు అవకాశంగానీ, భవిష్యత్తుగానీ లేదని, జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్‌తో సమావేశం అనంతరం రాజీనామా చేసే అవకాశం ఉందని అన్నామలై పేర్కొన్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఇటీవల జరిగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఒక్క సీటు గెలిచిన విషయం తెలిసిందే. ఢిల్లీకి విమానం ఎక్కేందుకు చెన్నై విమానాశ్రయానికి చేరుకున్న అన్నామలై విలేకరుల బృందంతో "దయచేసి వేచి ఉండండి.. మనం రెండు రోజుల్లో కూర్చుని మాట్లాడుకుందాం" అని అన్నారు. ఆసక్తికరమైన విషయం ఏంటంటే విమానాశ్రయానికి ఆయన వచ్చిన వాహనంపై బీజేపీ జెండా లేదు.

## మేలో వాహన అమ్మకాల జోరు

ముంబై: దేశీయ వాహన రంగానికి సంబంధించి మే నెలలో భారీగా అమ్మకాలు నమోదయ్యాయి. దేశీయ డిమాండ్ స్థిరంగా కొనసాగడం, ఎస్‌యూవీలు, ప్యాసింజర్, కమర్షియల్ వాహనాలపై పెరిగిన ఆసక్తి ఈ వృద్ధికి ప్రధాన కారణాలుగా నిలిచాయి. ప్యాసింజర్ విభాగంలో దిగ్గజ మారుతీ సుజుకి మే నెలలో మొత్తం 2,42,688 వాహనాలను విక్రయించి కంపెనీ చరిత్రలోనే అత్యధిక నెలవారీ అమ్మకాల రికార్డును నమోదు చేసింది. ఇందులో దేశీయ విక్రయాలు 1,93,535 యూనిట్లు, ఎగుమతులు 41,914 యూనిట్లు ఉండగా, ఇతర ఓఈఎంలకు 7,239 యూనిట్లు సరఫరా చేసింది. ఇదే సమయంలో ఎంఅండ్ఎం మొత్తం 99,636 వాహనాలను విక్రయించి 20 శాతం వృద్ధిని నమోదు చేసింది. యుటిలిటీ వాహనాల డిమాండ్, ట్రాక్టర్ల విభాగంలో బలమైన పనితీరు ఈ వృద్ధికి మద్దతు ఇచ్చాయి. మిగతా కంపెనీల్లో హ్యుందాయ్ మోటార్ దేశీయ విక్రయాల్లో 9.1 శాతం వృద్ధిని నమోదు చేయగా, మొత్తం విక్రయాలు 4.1 శాతం పెరిగాయి. టొయోటా కిర్లోస్కర్ అమ్మకాలు 7 శాతం పెరిగి 33,128 యూనిట్లకు చేరాయి. ఎస్‌యూవీ సెగ్మెంట్, హైబ్రిడ్ వాహనాలపై డిమాండ్ ఈ వృద్ధికి సహకరించింది. సరఫరా విభాగంలో కొన్ని ఒత్తిళ్లు ఉన్నప్పటికీ, మొత్తం ఆటో మార్కెట్ స్థిరమైన డిమాండ్‌తో పాజిటివ్ ట్రెండ్‌ను కొనసాగిస్తోంది. ప్రత్యేకంగా ప్యాసింజర్, కమర్షియల్ వాహనాల విభాగాలు ఈ వృద్ధికి కీలకంగా నిలుస్తున్నాయి.

## అమెరికాతో చర్చలకు ఇరాన్ బ్రేక్

**లెబనాన్‌పై దాడుల ఎఫెక్ట్**

టెహ్రాన్: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరోసారి తీవ్రస్థాయికి చేరాయి. లెబనాన్‌పై ఇజ్రాయెల్ సైనిక దాడులను తీవ్రతరం చేయడంతో, అమెరికాతో జరుపుతున్న చర్చలను తక్షణమే నిలిపివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. యుద్ధాన్ని ముగించే లక్ష్యంతో ప్రాథమిక ఒప్పందం కోసం ఇరు దేశాల మధ్య మధ్యవర్తుల ద్వారా జరుగుతున్న సందేశాల మార్పిడికి బ్రేక్ వేసింది. ఈ విషయాన్ని ఇరాన్‌కు చెందిన తస్నీమ్ వార్తా సంస్థ తన కథనంలో వెల్లడించింది. లెబనాన్‌లో ఇజ్రాయెల్ నేరాలు కొనసాగిస్తుండటమే తమ నిర్ణయానికి కారణమని ఇరాన్ స్పష్టం చేసింది. "కాల్పుల విరమణకు లెబనాన్‌పై దాడులు చేయకూడదన్నది కూడా ఒక ముఖ్యమైన ముందస్తు షరతు. కానీ లెబనాన్‌తో సహా అన్ని అంశాల్లోనూ ఈ ఒప్పందాన్ని ఉల్లంఘించారు. అందుకే మధ్యవర్తిత్వం ద్వారా జరుగుతున్న చర్చలను, సందేశాల మార్పిడిని ఇరాన్ చర్చల బృందం నిలిపివేస్తుంది" అని తస్నీమ్ నివేదిక పేర్కొంది. పరిణామంపై అంతకుముందు ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాఘ్చి, పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బఘేర్ ఘలీబాఫ్ తీవ్రంగా స్పందించారు. ఇజ్రాయెల్ దాడులకు తగిన పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. అమెరికాతో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం లెబనాన్‌తో సహా అన్ని ప్రాంతాలకు వర్తిస్తుందని, ఏ ఒక్కచోట ఉల్లంఘన జరిగినా, అది అన్నిచోట్లా జరిగినట్టేనని వ్యాఖ్యానించారు. దీని పరిణామాలకు అమెరికా, ఇజ్రాయెల్ బాధ్యత వహించాలని అరాఘ్చి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

## పోరు డీఎంకే-టీవీకే మధ్యే: విజయ్

చెన్నై: తమిళనాడులో రాజకీయ పోరు ఇకపై టీవీకే, డీఎంకే మధ్య మాత్రమేనని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, టీవీకే అధినేత విజయ్ అన్నారు. ఎన్నికల్లో ఘన విజయం సాధించిన తర్వాత సోమవారం తొలిసారిగా నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. రాష్ట్రంలో కుటుంబ రాజకీయాలకు ప్రజలు చరమగీతం పాడారని ఆయన వ్యాఖ్యానించారు. తన పాలన ప్రజలందరి కోసం ఉంటుందని, రాష్ట్ర హక్కులు, లౌకికవాదం విషయంలో ఎట్టి పరిస్థితుల్లో రాజీపడబోమని హామీ ఇచ్చారు. "రాజకీయంగా చెబుతున్నా, ఇప్పుడు పోటీ కేవలం రెండు పార్టీల మధ్యే. ఒకటి డీఎంకే, మరొకటి టీవీకే. మధ్యలో ఇంకెవరికీ పాత్ర లేదు" అని ఆయన తేల్చిచెప్పారు. తమ పార్టీపై వస్తున్న హార్స్ ట్రేడింగ్ ఆరోపణలను ఖండించిన విజయ్, అధికారం కోల్పోయిన డీఎంకే, అన్నాడీఎంకేలే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. "ఇన్నేళ్లుగా మిమ్మల్ని మోసం చేస్తున్న వారిని కాదని, మీ కోసం పనిచేయడానికి వచ్చిన మీ విజయ్‌ను, మీ అన్నను, మీ తమ్ముడిని ముఖ్యమంత్రిగా కాదు, మీ మొదటి సేవకుడిగా ఎన్నుకున్నారు" అని అన్నారు. తాను అధికారంలోకి వచ్చి కొద్ది వారాలే అయినా, ఆరు నెలలు మౌనంగా ఉంటామని చెప్పిన వాళ్లు ఆరు రోజులు కూడా ఆగలేకపోయారని విమర్శించారు. చివరగా, తాను సూట్ ధరించడంపై వస్తున్న విమర్శలపై స్పందిస్తూ, సూట్ ఎందుకు వేసుకోకూడదని ప్రశ్నించారు.

## స్నేహం పేరుతో నేరాలను ఉపేక్షించం

**యూపీ సీఎం యోగిఆదిత్యనాథ్**

లక్నో: స్నేహం లేదా మరే ఇతర వ్యక్తిగత సంబంధాల ముసుగులో జరిగే నేరాలను రాష్ట్ర ప్రభుత్వం ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోదని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్రంగా హెచ్చరించారు. ఘజియాబాద్‌లో ఇటీవల జరిగిన సూర్య చౌహాన్ హత్య ఘటనపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఒక బహిరంగ కార్యక్రమంలో మాట్లాడుతూ, ఘజియాబాద్‌లో జరిగిన ఘటన సమాజానికి ఆందోళన కలిగించే విషయమని యోగి అన్నారు. స్నేహితుడిలా నటిస్తూ ఒక వ్యక్తి ప్రాణాలు తీయడం కేవలం నేరమే కాదు, అది పెద్ద ద్రోహమని అన్నారు. ఇలాంటి కేసుల్లో చట్టం తన పని తాను చేసుకుపోతుందని స్పష్టం చేశారు. దోషులకు ఎలాంటి ఉపశమనం లభించదని ఆయన అన్నారు. తప్పుడు మార్గాల్లో వెళుతున్న పిల్లలను సక్రమమార్గంలో మళ్లించలేని తల్లిదండ్రులు పెద్ద తప్పు చేస్తున్నట్లే అన్నారు.

## బీఎస్ఎన్ఎల్ కొత్త ప్లాన్.. రూ.599




న్యూఢిల్లీ: బీఎస్ఎన్ఎల్ తన ప్రీపెయిడ్ యూజర్ల కోసం ఒక ఆకర్షణీయమైన కొత్త ప్లాన్‌ను సోమవారం అందుబాటులోకి తెచ్చింది. రూ.599 రీఛార్జ్‌తో వినియోగదారులకు భారీ ప్రయోజనాలను అందిస్తూ ఈ ప్లాన్‌ను రూపొందించింది. ప్రైవేట్ టెల్కోలకు గట్టి పోటీనిచ్చేలా ఈ ఆఫర్ ఉంది. ఈ కొత్త రూ.599 ప్లాన్ కింద రీఛార్జ్ చేసుకున్న వారికి 70 రోజుల వ్యాలిడిటీ లభిస్తుంది. ఈ సమయంలో రోజుకు 3+దీ చొప్పున హై-స్పీడ్ డేటాను వాడుకోవచ్చు. అంటే, ప్లాన్ మొత్తం మీద 210 +దీ డేటా అందుబాటులో ఉంటుంది. రోజువారీ డేటా పరిమితి ముగిసిన తర్వాత కూడా ఇంటర్నెట్ సేవలు కొనసాగుతాయి, కానీ వేగం తగ్గుతుంది. డేటాతో పాటు భారతదేశంలోని ఏ నెట్‌వర్క్‌కైనా అపరిమిత వాయిస్ కాల్స్, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు, ఉచిత నేషనల్ రోమింగ్ సదుపాయాలు కూడా ఈ ప్లాన్‌లో ఉన్నాయి.

## భారీ నష్టాల్లో మార్కెట్లు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం భారీ నష్టాలతో ముగిశాయి. ఎఫ్ఎంసీజీ, పీఎస్‌యూ బ్యాంకింగ్, ఆటో, రియల్టీ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి పెరగడంతో సూచీలు కుదేలయ్యాయి. మరోవైపు, అమెరికా-ఇరాన్ మధ్య దౌత్యపరమైన పరిణామాలను ఇన్వెస్టర్లు నిశితంగా గమనిస్తున్నారు. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 508.40 పాయింట్లు నష్టపోయి 74,267.34 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 165.15 పాయింట్ల పతనంతో 23,382.60 వద్ద ముగిసింది. బ్రాడర్ మార్కెట్లలోనూ అమ్మకాల ఒత్తిడి కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 1.45 శాతం తగ్గగా, స్మాల్‌క్యాప్ 0.88 శాతం నష్టపోయింది. నిఫ్టీలో హిందుస్థాన్ యూనిలీవర్, శ్రీరామ్ ఫైనాన్స్, టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్, ఐటీసీ, ఎన్టీపీసీ షేర్లు ప్రధాన నష్టాల్లో ఉన్నాయి. సెన్సెక్స్ స్టాక్స్‌లో హిందుస్థాన్ యూనిలీవర్, ఐటీసీ, ఎన్టీపీసీ, మహీంద్రా అండ్ మహీంద్రా, కోటక్ మహీంద్రా బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్ 2.83 శాతం వరకు నష్టపోయాయి. అయితే, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్ వంటి ఐటీ షేర్లు లాభపడటంతో సూచీల పతనం కొంతమేర పరిమితమైంది. సాంకేతిక విశ్లేషకుల ప్రకారం, నిఫ్టీ 23,500 స్థాయిని కోల్పోవడంతో సమీప భవిష్యత్తులో బలహీనపడింది. తక్షణ నిరోధకం 23,500 వద్ద, బలమైన నిరోధకం 23,600-23,750 జోన్‌లో ఉండొచ్చని అంచనా వేస్తున్నారు.

## సుప్రీంకోర్టుకు కొత్తగా
## ఐదుగురు న్యాయమూర్తులు



న్యూఢిల్లీ: సర్వోన్నత న్యాయస్థానానికి ఐదుగురు కొత్త న్యాయమూర్తులు నియమితులయ్యారు. నలుగురు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు, ఒక సీనియర్ న్యాయవాదిని సుప్రీంకోర్టు జడ్జీలుగా నియమించాలంటూ కొలీజియం చేసిన సిఫార్సులకు కేంద్ర ప్రభుత్వం సోమవారం ఆమోదముద్ర వేసింది. ఈ నియామకాలకు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపినట్లు కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. భారత ప్రధాన న్యాయమూర్తితో సంప్రదింపుల అనంతరం రాజ్యాంగంలోని ఆర్టికల్ 124(2) ప్రకారం ఈ నియామకాలు జరిగాయని ఆయన తన పోస్ట్‌లో పేర్కొన్నారు. మే 22, 27 తేదీల్లో జరిగిన సమావేశాల్లో సుప్రీంకోర్టు కొలీజియం ఈ ఐదుగురి పేర్లను పదోన్నతి కోసం కేంద్రానికి సిఫార్సు చేసింది. కొత్తగా నియమితులైన వారిలో పంజాబ్, హరియాణా హైకోర్టు చీఫ్ జస్టిస్ షీల్ నాగు, బాంబే హైకోర్టు చీఫ్ జస్టిస్ శ్రీ చంద్రశేఖర్, మధ్యప్రదేశ్ హైకోర్టు చీఫ్ జస్టిస్ సంజీవ్ సచ్‌దేవా, జమ్మూకశ్మీర్, లడఖ్ హైకోర్టు చీఫ్ జస్టిస్ అరుణ్ పల్లి ఉన్నారు. వీరితో పాటు సుప్రీంకోర్టు సీనియర్ అడ్వకేట్ వి. మోహనను కూడా నేరుగా సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమించారు. దేశవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న కేసులను వేగంగా పరిష్కరించే లక్ష్యంతో ఇటీవల కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్యను పెంచిన విషయం తెలిసిందే. ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) కాకుండా న్యాయమూర్తుల సంఖ్యను 33 నుంచి 37కి పెంచుతూ రాష్ట్రపతి ఆర్డినెన్స్ జారీ చేశారు. ఈ నేపథ్యంలో తాజా నియామకాలకు ప్రాధాన్యం ఏర్పడింది. కొత్తగా నియమితులైన న్యాయమూర్తులు వివిధ హైకోర్టులలో విశేష అనుభవం ఉంది. జస్టిస్ నాగు 2011 నుంచి జస్టిస్ చంద్రశేఖర్, జస్టిస్ సచ్‌దేవా, జస్టిస్ పల్లి 2013 నుంచి న్యాయమూర్తులుగా సేవలందిస్తున్నారు. సీనియర్ అడ్వకేట్ మోహన సుప్రీంకోర్టులో రాజ్యాంగ, సివిల్, సర్వీస్ సంబంధిత కేసుల వాదనలో నిపుణురాలిగా పేరుగాంచారు. ఈ నియామకాలతో సుప్రీంకోర్టులో కార్యకలాపాలు మరింత వేగవంతం కానున్నాయి.

## జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలు విడుదల

**టాపర్‌గా శుభమ్ కుమార్,**
**అమ్మాయిల్లో అరోహి దేశ్‌పాండే ఫస్ట్**

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఇంజినీరింగ్ ఆశావహులు ఎంతో ఉత్కంఠగా ఎదురుచూస్తున్న జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) అడ్వాన్స్‌డ్ 2026 ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) రూర్కీ ఈ ఫలితాలను ప్రకటించింది. ఐఐటీ ఢిల్లీ జోన్‌కు చెందిన శుభమ్ కుమార్ ఆల్ ఇండియా టాపర్‌గా నిలవగా, అమ్మాయిల విభాగంలో అరోహి దేశ్‌పాండే అత్యధిక ర్యాంకును సాధించారు. కామన్ ర్యాంక్ లిస్ట్ (సీఆర్ఎల్)లో శుభమ్ కుమార్ 360 మార్కులకు గాను 330 మార్కులు సాధించి అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ ఫలితాల్లో ఐఐటీ ఢిల్లీ జోన్ విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ కనబరిచారు. శుభమ్ కుమార్ తర్వాత, అదే జోన్‌కు చెందిన కబీర్ చిల్లార్, జతైన్ చాహర్ వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచి తమ ప్రాంతానికి గర్వకారణంగా నిలిచారు. అధికారిక డేటా ప్రకారం, జేఈఈ అడ్వాన్స్‌డ్ 2026 కోసం 1,87,389 మంది అభ్యర్థులు నమోదు చేసుకోగా, మే 17న జరిగిన రెండు పేపర్లకు 1,79,694 మంది హాజరయ్యారు. వీరిలో 56,880 మంది అభ్యర్థులు అర్హత సాధించారు.

## మే.. ఉగ్ర మరణాలు లేని కశ్మీర్!

శ్రీనగర్: జమ్ముకశ్మీర్ భద్రతా చరిత్రలో ఒక చారిత్రక మైలురాయి నమోదైంది. గత మూడు దశాబ్దాలకు పైగా కాలంలో తొలిసారిగా, ఉగ్రవాద సంబంధిత హింసలో ఒక్క మరణం కూడా నమోదు కాకుండా ఒక నెల (2026 మే) గడిచింది. కేంద్రపాలిత ప్రాంతంలో భద్రతా పరిస్థితి గణనీయంగా మెరుగుపడిందనడానికి ఇది నిదర్శనంగా నిలుస్తోంది. సౌత్ ఏషియా టెర్రరిజం పోర్టల్ (ఎస్ఏటీపీ) వంటి స్వతంత్ర ట్రాకర్లతో పాటు అధికారిక గణాంకాలు కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించాయి. జాతీయ మీడియా సంస్థలు వెల్లడించిన నివేదికల ప్రకారం, ఈ ఏడాది తొలి ఐదు నెలల్లో కేవలం 12 ఉగ్రవాద సంబంధిత మరణాలు మాత్రమే సంభవించాయి. అందులో 10 మంది ఉగ్రవాదులు, ఒక భద్రతా సిబ్బంది ఉన్నారు. ఈ కాలంలో ఒక్క సామాన్యుడు కూడా ప్రాణాలు కోల్పోలేదు. గతంతో పోలిస్తే ఇది చాలా మెరుగైన పరిస్థితి.

## ధర్మేంద్ర ప్రధాన్
## రాజీనామా చేయాల్సిందే

న్యూఢిల్లీ: సీబీఎస్ఈ బోర్డు పరీక్షలు, ఇతర జాతీయ పరీక్షల వివాదాలు దేశంలో చర్చనీయాంశంగా మారిన వేళ సరికొత్తగా ఆవిర్భవించిన 'కాక్రోచ్ జనతా పార్టీ' వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే సంచలన ప్రకటన చేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ శాంతియుత నిరసనలు చేపట్టడానికి జూన్ 6న భారతదేశానికి తిరిగి వస్తున్నట్లు ప్రకటించారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వీడియోను విడుదల చేసిన అభిజీత్ దీప్కే.. జూన్ 6 శనివారం ఉదయం తాను ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో దిగుతున్నట్లు వెల్లడించారు.

## భారత్‌తోనే పశ్చిమాసియాలో
## శాంతి: ఇజ్రాయెల్

న్యూఢిల్లీ: భౌగోళిక ఉద్రిక్తతలు, ఆర్థిక అనిశ్చితి నేపథ్యంలో పశ్చిమాసియా ప్రాంతంలో శాంతి భద్రతలను నెలకొల్పడానికి భారతదేశం అత్యంత కీలకమైన పాత్ర పోషించాల్సి ఉందని ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజర్ అభిప్రాయపడ్డారు. వేగంగా ఎదుగుతున్న ఆర్థిక శక్తిగా, బలమైన వాణిజ్య భాగస్వామిగా భారత్ ఈ ప్రాంత ముఖచిత్రాన్ని మార్చేయగలదని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రపంచంలోని అన్ని ప్రధాన వాణిజ్య కూటములతో భారత్ చారిత్రాత్మక ఒప్పందాలను కుదుర్చుకుందని రూవెన్ అజర్ గుర్తుచేశారు. "పశ్చిమాసియా ప్రాంతంలో శాంతిని నెలకొల్పి, తీవ్రవాద శక్తులను అణచివేయగలిగితే.. భారత్ ద్వారా వచ్చే ట్రిలియన్ డాలర్ల పెట్టుబడులు, వస్తు రవాణా వల్ల ఇక్కడి దేశాలన్నీ అద్భుతమైన సంపదను, శ్రేయస్సును అనుభవిస్తాయి. అందుకే ఈ ప్రాంత స్థిరత్వంలో ఢిల్లీ పాత్ర ఎంతో కీలకం" అని ఆయన పేర్కొన్నారు.





## ఎల్లమ్మకు దావ వసంత పూజలు

జగిత్యాల, జూన్ 1 (ఈవార్తలు): జగిత్యాల మండలం ధరూర్ గ్రామంలో నిర్వహించిన సౌడలమ్మ బోనాలు, ఎల్లమ్మ పట్నాల కార్యక్రమంలో జిల్లా తొలి జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని గ్రామ ప్రజల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాల కోసం ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో నాయకులు సన్నిత్ రావు, మల్లేష్ యాదవ్, మధు యాదవ్, గంగాధర్ యాదవ్, సతీష్, శేఖర్ యాదవ్, భూమయ్య, వినీల్ రావు, గంగారం యాదవ్, మోహన్ యాదవ్, అభి, తిరుపతి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానంలో యువత ముందడుగు




జగిత్యాల, జూన్ 1 (ఈవార్తలు): మానవత్వానికి ప్రతీకగా నిలిచే రక్తదానం ద్వారా అనేక మంది ప్రాణాలను కాపాడవచ్చని వక్తలు పేర్కొన్నారు. ఏఐఎంఐఎం జగిత్యాల ఆధ్వర్యంలో, వార్డు నెం. 34 కౌన్సిలర్ డాక్టర్ మహమ్మద్ అయ్యూబ్ ఖాన్ పర్యవేక్షణలో ఈద్గా రహబర్ యూత్ జగిత్యాల నిర్వహించిన రక్తదాన శిబిరం విజయవంతంగా జరిగింది. ఈ సందర్భంగా పలువురు యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. ప్రమాద బాధితులు, శస్త్రచికిత్సలు చేయించుకునే రోగులు, ప్రసవ సమయంలో తల్లులు, అలాగే తలసేమియా, క్యాన్సర్ వంటి వ్యాధులతో బాధపడుతున్న వారికి రక్తదానం ఎంతో అవసరమని నిర్వాహకులు తెలిపారు. శిబిరం విజయవంతం కావడంలో అడ్వకేట్ మహమ్మద్ సల్మాన్ ఖాన్, ఫైనాన్స్ మేనేజర్ మహమ్మద్ షాహెజాద్ అలీ, మహమ్మద్ జుబేర్ ఖాన్, కైసర్ భాయ్, షోయెబ్ సుబుర్, సమీర్, ముక్తార్, హకీం, పబ్బు, అబ్రార్, ఇర్ఫాన్ ఖురేషి తదితరులు విశేష కృషి చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, "ప్రతి చుక్క రక్తం విలువైనదే.. ప్రతి ప్రాణం ముఖ్యమైనదే. ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా రక్తదానం చేసి సమాజ సేవలో భాగస్వాములు కావాలి" అని పిలుపునిచ్చారు.



## పామాయిల్ తోట దగ్ధం

**రైతులకు ప్రభుత్వం అండగా నిలవాలి**

**మాజీమంత్రి జీవన్ రెడ్డి డిమాండ్.. అగ్నిప్రమాదానికి గురైన తోట పరిశీలన**

రాయికల్, జూన్ 1 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా రాయికల్ మండలం కొత్తపేట గ్రామంలో ఇటీవల అగ్నిప్రమాదానికి గురైన పామాయిల్ తోటను మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి పరిశీలించారు. ఆయనతో పాటు మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్, యువజన నాయకుడు తాటిపర్తి సీకే రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తోటలో జరిగిన నష్టాన్ని పరిశీలించిన జీవన్ రెడ్డి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. జిల్లాలోని పలు గ్రామాల్లో పామాయిల్ తోటలు అగ్నిప్రమాదాలకు గురవుతున్నాయని, దీనిపై రెవెన్యూ శాఖతో పాటు ఉద్యానవన శాఖ అధికారులు సమగ్ర నివేదిక రూపొందించి ప్రభుత్వానికి అందజేయాలని సూచించారు. అగ్నిప్రమాదాల వల్ల నష్టపోయిన పామాయిల్ రైతులకు ప్రభుత్వం తక్షణ ఆర్థిక సాయం అందించడంతో పాటు, దెబ్బతిన్న డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థలను పునరుద్ధరించేలా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులు ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల, గ్రామ స్థాయి బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు



## ఫోన్‌లో ఐపీఎల్ మ్యాచ్ చూస్తూ డ్రైవింగ్

**బావిలోకి దూసుకెళ్లిన కారు..యువకుడి మృతి.. ఇద్దరికి గాయాలు**

జగిత్యాల రూరల్, జూన్ 1 (ఈవార్తలు): సెల్‌ఫోన్ వినియోగంలో నిర్లక్ష్యం ఓ యువకుడి ప్రాణాలను బలిగొన్న ఘటన జగిత్యాల జిల్లా జగిత్యాల రూరల్ మండలం మోరపెల్లి గ్రామ శివారులో చోటుచేసుకుంది. థార్ వాహనంలో ప్రయాణిస్తున్న ముగ్గురు యువకుల్లో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. ప్రాథమిక సమాచారం మేరకు, జగిత్యాల పట్టణానికి చెందిన అరుణ్, నివేష్, అశ్విన్ ఆదివారం రాత్రి థార్ వాహనంలో ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో మొబైల్ ఫోన్‌లో ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్ వీక్షిస్తూ వెళ్తుండగా వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనున్న వ్యవసాయ బావిలోకి దూసుకెళ్లినట్లు తెలుస్తోంది. ప్రమాదం సంభవించగానే స్థానికులు వెంటనే సహాయక చర్యలు చేపట్టి నివేష్, అశ్విన్‌లను బయటకు తీశారు. అయితే వాహనం నడుపుతున్న అరుణ్ బావిలోనే చిక్కుకుపోయి మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని దాదాపు రెండు గంటలపాటు శ్రమించి బావిలో నుంచి కారును, అరుణ్ మృతదేహాన్ని వెలికితీశారు. గాయపడిన ఇద్దరిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వాహనం నడుపుతూ మొబైల్ ఫోన్ వినియోగించడం, వీడియోలు లేదా మ్యాచ్‌లు వీక్షించడం ప్రాణాంతక ప్రమాదాలకు దారితీస్తుందని పోలీసులు హెచ్చరిస్తున్నారు. డ్రైవింగ్ సమయంలో పూర్తి అప్రమత్తతతో ఉండాలని సూచిస్తున్నారు.

**జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం**

## జనగణన సర్వే గడువును

# 15 రోజులు పొడిగించాలి



హైదరాబాద్, జూన్ 1 (ఈవార్తలు): దేశవ్యాప్తంగా కొనసాగుతున్న జనగణన ప్రక్రియలో భాగంగా నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే (హౌస్ లిస్టింగ్) గడువును మరో 15 రోజులు పొడిగించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ప్రధానమంత్రికి ఓ లేఖ వ్రాశారు. రాష్ట్రాలతో పాటు దేశంలోని పలు ప్రాంతాల్లో వేసవి సెలవులు, ఉద్యోగాలు, వ్యాపారాలు, విద్యా అవసరాల కారణంగా లక్షలాది కుటుంబాలు తమ నివాస గృహాలకు దూరంగా ఉ ండటంతో ఇంటింటి సర్వే పూర్తి స్థాయిలో జరగలేదని ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు. తాజాగా వెలువడిన అధికారిక సమాచారం ప్రకారం తెలంగాణలోనే సుమారు 20 లక్షల ఇండ్లలో సర్వే ఇంకా పెండింగ్లో ఉన్నట్లు వెల్లడైందన్నారు. రాష్ట్ర జనాభా 4 కోట్లకు పైగా చేరే అవకాశమున్న నేపథ్యంలో ప్రతి కుటుంబం వివరాలు ఖచ్చితంగా నమోదు కావడం అత్యంత కీలకమని గుజ్జ సత్యం అన్నారు. జనగణన అధారంగానే సంక్షేమ పథకాల రూపకల్పన, నిధుల కేటాయింపు, విద్య, ఉద్యోగ, ఉపాధి, సామాజిక న్యాయం, రాజకీయ ప్రాతినిధ్యం వంటి అంశాలపై నిర్ణయాలు తీసుకుంటారని ఆయన గుర్తు చేశారు. ప్రత్యేకించి బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలు, వలస కార్మికులు, అద్దె ఇళ్లలో నివసించే కుటుంబాలు మరియు విద్యార్థుల వివరాలు నమోదు కాకుండా మిగిలిపోయే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సర్వే గడువు ముగిసే సమయానికి ప్రజలు తమ స్వగ్రామాలు, నివాస ప్రాంతాలకు పూర్తిగా చేరుకోకపోవడంతో అనేక కుటుంబాలు జనగణనకు దూరమయ్యే పరిస్థితి నెలకొందన్నారు. జనగణనలో ఒక్క కుటుంబం కూడా మినహాయింపుకు గురికాకుండా సమగ్ర సమాచారం సేకరించాలంటే కేంద్ర ప్రభుత్వం స్పందించి ప్రస్తుత గడువును కనీసం మరో 15 రోజులు పొడిగించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అలాగే సర్వేపూర్తి కాని ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి మిగిలిన కుటుంబాల వివరాలను నమోదు చేయాలని సూచించారు. సమగ్ర జనగణన ద్వారానే దేశంలోని అన్ని సామాజిక వర్గాల నిజమైన జనాభా, ఆర్థిక సామాజిక పరిస్థితులు వెలుగులోకి వస్తాయని, తద్వారా అభివృద్ధి ఫలాలు ప్రతి వర్గానికి సమానంగా చేరే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.



## తల్లిని గెంటేసిన కొడుకు

**ఆర్డీవోకు ఫిర్యాదు.. కేసు నమోదు**

జగిత్యాల టౌన్, జూన్ 1 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలోని తులసీనగర్‌కు చెందిన ఎడ్ల నర్సమ్మ (80) అనే వృద్ధురాలిని ఆమె కుమారుడు ఇంటి నుంచి గెంటివేశాడని ఆరోపిస్తూ ఆర్డీవోను ఆశ్రయించింది. సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, న్యాయవాది హరి అశోక్‌కుమార్ సహకారంతో ఫిర్యాదు చేయగా, వృద్ధుల సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేశారు. బాధితురాలు మాట్లాడుతూ.. తన కుమారుడు హనుమాండ్లు, కోడలు మంజుల, మనుమడు సంజీవ్ గత కొన్నేళ్లుగా తనను వేధిస్తున్నారని ఆరోపించారు. తిండి పెట్టకుండా హింసిస్తూ, ఇంటి నుంచి వెళ్లిపోవాలని ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. సోమవారం తనను ఇంటి నుంచి బయటకు పంపించారని వాపోయారు. తనకు సొంత ఇంట్లో ఉ ండే అవకాశం కల్పించి, కుమారుడి నుంచి పోషణ భృతి, వైద్య ఖర్చులు ఇప్పించాలని అధికారులను కోరారు. వృద్ధురాలి వెంట హరి అశోక్‌కుమార్, పి. హన్మంత్‌రెడ్డి, విశ్వనాథం సత్యనారాయణ తదితరులు ఉన్నారు



## కొండగట్టు అంజన్న సేవలో నటుడు సంజోష్

మల్యాల, జూన్ 1 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి వారిని సినీ నటుడు సంజోష్ సోమవారం దర్శించుకున్నారు. స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ ఉప ప్రధాన అర్చకులు చిన్న రాము ముఖ్య అర్చక పవన్ వేదోక్త ఆశీర్వచనాలు అందజేసి శేషవస్త్రం కప్పి లడ్డూ ప్రసాదాన్ని అందించారు. ఈ సందర్భంగా సంజోష్ మాట్లాడుతూ స్వామివారి అనుగ్రహంతో సుఖశాంతులు, విజయాలు కలగాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు ఆయనతో కలిసి ఫోటోలు దిగారు. ఈ కార్యక్రమంలో టెంపుల్ సుపరింటెండెంట్ ఉపాధ్యాయుల చంద్రశేఖర్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ తూము శ్రీనివాస్ ఏఎస్సై చిలుక శ్రీనివాస్ పాల్గొన్నారు.

## బస్సు కోసం తక్కళ్లపెల్లి ప్రజల వినతులు



మల్యాల/జగిత్యాల, జూన్ 1 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండలం తక్కలపెల్లి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ గ్రామస్తులు సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. జగిత్యాల-పెగడపల్లి ప్రధాన మార్గంలో తక్కలపెల్లి గ్రామం గుండా ఆర్టీసీ బస్సు సర్వీసులు నడపాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన ఓ వృద్ధ మహిళ చేసిన వ్యాఖ్యలు అందరి దృష్టిని ఆకర్షించాయి. ఎన్నికల సమయంలో గ్రామానికి వచ్చిన చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఓట్లు అడిగిన తీరును ఆమె తనదైన శైలిలో అనుకరించారు. 'మా గ్రామానికి బస్సు లేదు.. మా పెన్షన్ ఎప్పుడు వస్తది.. ఓటు వేయకుంటే సచ్చిపోతాను అంటూ ఓట్లు అడిగారు.. ఇప్పుడు మాత్రం కనిపించడం లేదు' అని ఆమె చేసిన వ్యాఖ్యలతో ప్రజావాణి సభలో నవ్వులు పూశాయి. అయితే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసి, గ్రామానికి వెంటనే బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.



## తాటిపల్లి కురుమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

మల్యాల, జూన్ 1 (ఈవార్తలు): మల్యాల మండలం తాటిపల్లి కురుమ సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఏనుగుల రాజు, ఉపాధ్యక్షుడిగా దూడ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా అశోక్, సంయుక్త కార్యదర్శిగా కొమురయ్య, కోశాధికారిగా వెంకటేశ్, కార్యనిర్వాహక సభ్యులుగా చిన్నరాయమల్లు, పెద్దరాజయ్య, దేవయ్య, రాయమల్లయ్య, తిరుపతి, ఓదెలు ఎన్నికయ్యారు. సలహాదారులుగా మల్లేశం, మహేశ్, వీడీసీగా గుట్టయ్య, నర్సయ్య బాధ్యతలు స్వీకరించారు.



## లోన్ యాప్ వేధింపులతో యువకుడి మృతి

పెగడపల్లి, జూన్ 1 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల కేంద్రంలో విషాద ఘటన చోటుచేసుకుంది. లోన్ యాప్ నిర్వాహకుల వేధింపులు భరించలేక ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన అక్కినపల్లి లిఖిత్ (21) కొంతకాలంగా వివిధ లోన్ యాప్‌ల ద్వారా అప్పులు తీసుకున్నాడు. అప్పు చెల్లింపుల విషయంలో యాప్ నిర్వాహకులు తీవ్రంగా వేధింపులకు గురిచేసినట్లు సమాచారం. ఈ వేధింపులను తట్టుకోలేక కొద్ది రోజుల క్రితం లిఖిత్ పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు వెంటనే అతడిని హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెగడపల్లి ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. లోన్ యాప్ వేధింపుల కోణంలో అన్ని అంశాలను పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు.





## భూసర్వే అవకతవకలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

బీర్పూర్, జగిత్యాల, జూన్ 1 (ఈవార్తలు): బీర్పూర్ మండలంలోని కోమన్‌పల్లి గ్రామంలో ఆబాది భూమిని కొందరు వ్యవసాయ భూమిగా చూపించి పట్టాలు పొందేందుకు కుట్రలు జరిగాయని ఆరోపిస్తూ మాజీ గ్రామ సర్పంచ్ సీపతి రమేష్ ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ రాజాగౌడ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన ఆబాది భూమిని కొందరు వ్యక్తులు అక్రమంగా కబ్జా చేసి సాగు చేసుకుంటున్నారని తెలిపారు. ఇటీవల నిర్వహించిన పైలెట్ భూసర్వేలో ఆ భూమిని పట్టాభూమిగా నమోదు చేసుకున్నారని ఆరోపించారు. ఈ ప్రక్రియలో అప్పటి అధికారులు సహకరించారని పేర్కొన్నారు. కాబట్టి సంబంధిత భూమిపై మళ్లీ రీసర్వే నిర్వహించి, ఆబాది భూమిని కబ్జాదారుల నుంచి విడిపించాలని కోరారు. అలాగే అక్రమ కబ్జాలకు పాల్పడిన వారిపై, వారికి సహకరించిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్‌ను విజ్ఞప్తి చేశారు.

## దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రారంభం

విశాఖపట్నం, జూన్ 1 (ఈవార్తలు): ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల చిరకాల స్వప్నం ఎట్టకేలకు సాకారమైంది. విశాఖపట్నం కేంద్రంగా ఏర్పాటైన దేశ 18వ రైల్వే జోన్ 'దక్షిణ కోస్తా రైల్వే' (రాజశీ=) సోమవారం అధికారికంగా తన కార్యకలాపాలను ప్రారంభించింది. ప్రత్యేక రైల్వే పరిపాలన, మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షలు నెరవేరాయి. ఈ చరిత్రాత్మక పరిణామంతో ఆంధ్రప్రదేశ్, ముఖ్యంగా ఉత్తరాంధ్ర అభివృద్ధిలో ఒక కొత్త శకానికి నాంది పలికినట్లయింది.



## జగిత్యాలలో క్రికెట్ శిక్షణ శిబిరం

**ప్రారంభించిన ఎమ్మెల్యే సంజయ్‌కుమార్**

జగిత్యాల టౌన్, జూన్ 1 (ఈవార్తలు): క్రీడల ద్వారా మానసిక ఉల్లాసంతో పాటు ఏకాగ్రత పెరుగుతుందని, గెలుపు-ఓటములను సమానంగా స్వీకరించే తత్వం అలవడుతుందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ నిర్వహిస్తున్న ఉచిత వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాన్ని మంగళవారం జగిత్యాల వివేకానంద మినీ స్టేడియంలో ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల ద్వారా స్నేహభావం, క్రమశిక్షణ పెంపొందుతాయని తెలిపారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో క్రీడా మైదానం ఏర్పాటు కోసం హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సహకారంతో కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జగిత్యాల జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి దాడి జలపతి, కోశాధికారి రౌతు గంగారెడ్డి, నాయకులు బండ శంకర్, చెట్టే గంగాధర్, దయాల శంకర్, కుసరి అనిల్, తదితరులు పాల్గొన్నారు.

## వయ్యారి చిత్రం


సోనాల్ చౌహాన్



# గోపీచంద్ 34 షూటింగ్ షురూ

టాలీవుడ్ యాక్టర్ గోపీచంద్ ప్రస్తుతం 'భరత వర్ష : సాగా ఆఫ్ శూల' సినిమాలో నటిస్తున్నాడని తెలిసిందే. సంకల్ప్ రెడ్డి డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రం షూటింగ్ దశలో ఉంది. కాగా ఈ మూవీ సెట్స్‌పై ఉండగానే గోపీచంద్ 34గా రాబోతున్న మరో సినిమాను కూడా లాంచ్ చేశాడు. పాపులర్ స్టంట్ మాస్టర్ వీ వెంకట్ ఈ సినిమాతో డైరెక్టర్‌గా ఎంట్రీ ఇస్తుండటంతో మూవీ లవర్స్‌లో సినిమాపై ఆసక్తి నెలకొంది. మేలో లాంచ్ అయిన ఈ సినిమా షూటింగ్ ఫైనల్‌గా నేడు షురూ అయింది. ఈ చిత్రంలో అనార్కలి నాజర్ ఈ చిత్రంలో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. 70 ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై నిర్మిస్తున్న ఈ చిత్రానికి శ్యామ్ సీఎస్ మ్యూజిక్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నాడు. ఈ చిత్రానికి సంబంధించిన నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలపై త్వరలో క్లారిటీ ఇవ్వనున్నారు మేకర్స్. 'యాత్ర', 'ఆనందో బ్రహ్మ' వంటి విజయవంతమైన చిత్రాలను నిర్మించిన 70ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రీసెంట్‌గా విడుదలైన అనౌన్స్‌మెంట్ పోస్టర్ ప్రేక్షకుల్లో అంచనాలను పెంచేస్తుంది. మండుతున్న ఆకాశం, ఒక కొండపై గంభీరంగా నిలబడిన బ్లాక్ పాంథర్ విజువల్స్ చూస్తుంటే, ఇంటెన్స్ మైథికల్ యాక్షన్ డ్రామాగా సినిమా ఉండబోతుందని స్పష్టమవుతోంది. జాతీయ అవార్డు గ్రహీత శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్‌గా, రామకృష్ణ-మౌనిక ప్రొడక్షన్ డిజైనర్లుగా వ్యవహరిస్తున్నారు.

బాలీవుడ్ సీనియర్ నటుడు బాబీ డియోల్ ప్రస్తుతం తన కెరీర్‌లో దూసుకుపోతున్నాడు. విలన్ పాత్రల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్న ఆయన, వరుసగా భారీ ప్రాజెక్టులతో ప్రేక్షకులను అలరిస్తున్నారు. ముఖ్యంగా 'యానిమల్', 'కంగువ', 'హరిహర వీరమల్లు' వంటి చిత్రాలతో దేశవ్యాప్తంగా మంచి క్రేజ్ సంపాదించిన బాబీ డియోల్, తాజాగా తనపై మరియు హీరోయిన్ అలియా భట్‌పై వస్తున్న సోషల్ మీడియా ప్రచారాలపై ఘాటుగా స్పందించారు. అలియా భట్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న స్పై యాక్షన్ థ్రిల్లర్ 'ఆల్ఫా' చిత్రంలో బాబీ డియోల్ కీలక పాత్ర పోషిస్తున్నారు. అయితే ఈ సినిమా షూటింగ్ సమయంలో అలియా భట్, బాబీ డియోల్ మధ్య విభేదాలు తలెత్తాయని, ఇద్దరి మధ్య గొడవలు జరిగాయని సోషల్ మీడియాలో పలు కథనాలు వైరల్ అయ్యాయి. ఈ ప్రచారం అభిమానుల్లో కూడా ఆసక్తిని రేకెత్తించింది. ఈ నేపథ్యంలో ప్రముఖ టెలివిజన్ కార్యక్రమంలో పాల్గొన్న బాబీ డియోల్, ఈ వార్తలను పూర్తిగా ఖండించారు. తనకు సంబంధించిన ఈ రూమర్‌ను మొదట చూసినప్పుడు తానే ఆశ్చర్యపోయానని చెప్పారు. ఒక స్నేహితుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న కథనాన్ని తనకు పంపించగా, దాన్ని చూసి నవ్వు వచ్చిందని పేర్కొన్నారు. జనాలకు ఖాళీ సమయం ఎక్కువైందనుకుంటా. అందుకే కూర్చొని లేని కథలను సృష్టిస్తున్నారు. నిజంగా అలాంటివి ఎలా ఆలోచిస్తారో కూడా అర్థం కావడం లేదు అంటూ బాబీ డియోల్ అసహనం వ్యక్తం చేశారు.

# ఆలియా అద్భుతం






## రేపు ఇరుముడి ప్రత్యేక గ్లింప్స్

మాస్ మహారాజా రవితేజ నటిస్తున్న తాజా చిత్రం 'ఇరుముడి'పై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కిస్తున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రం ప్రకటించిన నాటి నుంచే సినీ అభిమానుల దృష్టిని ఆకర్షించింది. గత కొంతకాలంగా విభిన్నమైన కథలు, కొత్త తరహా పాత్రలతో ప్రేక్షకులను అలరించే ప్రయత్నం చేస్తున్న రవితేజ, ఈసారి కూడా మరో ఆసక్తికర కథతో ప్రేక్షకుల ముందుకు రానున్నారని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఇప్పటికే చిత్రానికి సంబంధించిన పోస్టర్లు, ప్రచార కార్యక్రమాలు మంచి స్పందనను అందుకోగా, తాజాగా చిత్రబృందం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న గ్లింప్స్ విడుదల తేదీని అధికారికంగా ప్రకటించింది. 'హార్ట్ ఆఫ్ ఇరుముడి' పేరుతో ప్రత్యేక గ్లింప్స్‌ను జూన్ 3న విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్ కూడా అభిమానులను ఆకట్టుకుంటోంది. సాధారణ యాక్షన్ లేదా మాస్ ప్రమోషన్‌కు భిన్నంగా, భావోద్వేగాలకు ప్రాధాన్యం ఇచ్చేలా పోస్టర్ డిజైన్ చేయడం ఆసక్తికరంగా మారింది. ముఖ్యంగా 'హార్ట్ ఆఫ్ ఇరుముడి' అనే టైటిల్‌తో గ్లింప్స్‌ను తీసుకురావడం వల్ల సినిమాలో ఎమోషనల్ కంటెంట్‌కు కీలక స్థానం ఉంటుందనే సంకేతాలు కనిపిస్తున్నాయి. దర్శకుడు శివ నిర్వాణ సినిమాల్లో భావోద్వేగాలు, మానవ సంబంధాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుంది. 'ఇరుముడి'లో కూడా అదే తరహా భావోద్వేగాలతో పాటు రవితేజ మాస్ ఇమేజ్‌కు తగ్గ అంశాలను బ్యాలెన్స్‌గా చూపించనున్నట్లు తెలుస్తోంది. అందుకే ఈ గ్లింప్స్‌పై అభిమానుల్లో ప్రత్యేక ఆసక్తి నెలకొంది.

## హైదరాబాద్‌కు మళ్లీ ఐమాక్స్ స్క్రీన్

హైదరాబాద్ సినీ లవర్స్‌కు ఇదొక అద్భుతమైన గుడ్ న్యూస్. నగరంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ఐమ్యాక్స్ స్క్రీన్‌ను తిరిగి తీసుకురావడానికి ఏషియన్ సినిమాస్ అధినేతలు సునీల్ నారంగ్, భరత్ నారంగ్.. ఐమాక్స్ కార్పొరేషన్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారు. సూపర్ స్టార్ మహేష్ బాబు, ఏషియన్ సినిమాస్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఏఎంబీ సినిమాస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో గల 'ఏఎంబీ క్లాసిక్ సుదర్శన్'లో ఈ సరికొత్త ఐమాక్స్ స్క్రీన్ రాబోతోంది. వెరైటీ ఇండియా నివేదిక ప్రకారం, భారతదేశంలో మూడు కొత్త 'ఐమాక్స్ విత్ లేజర్' స్క్రీన్లను ఏర్పాటు చేసేందుకు ఈ ఒప్పందం కుదిరింది. అందులో మొదటి స్క్రీన్‌ను 2026 చివరి నాటికి హైదరాబాద్‌లోనే అందుబాటులోకి తీసుకురావడానికి ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో ప్రసాద్స్ ఐమాక్స్ భారతదేశంలోనే ఒక ఐకానిక్ ల్యాండ్‌మార్క్‌గా ఉండేది, కానీ కొన్ని సాంకేతిక కారణాల వల్ల 2015 లో అక్కడ ఐమాక్స్ ప్రదర్శనలు నిలిచిపోవడంతో సినీ ప్రేమికులు గత పదేళ్లుగా ఈ అద్భుతమైన అనుభూతిని తీవ్రంగా మిస్ అవుతున్నారు.




## 'స్వయంభూ' కోసం నిఖిల్ సాహసాలు

టాలీవుడ్ లో ఇప్పుడు పీరియాడిక్ యాక్షన్ డ్రామాలకు మంచి క్రేజ్ నడుస్తోంది. పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవడానికి యంగ్ హీరోలు కూడా భారీ రిస్క్ చేస్తున్నారు. ఈ లిస్ట్ లో నిఖిల్ సిద్ధార్థ్ కూడా ఒక పెద్ద సినిమాతో సిద్ధమవుతున్నాడు. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో స్వయంభూ అనే భారీ బడ్జెట్ సినిమాలో నటిస్తున్న విషయం తెలిసిందే. ప్రాజెక్ట్ అనౌన్స్ చేసినప్పటి నుంచే మంచి హైప్ క్రియేట్ అయింది. నిఖిల్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమాకు సంబంధించిన ఒక స్పెషల్ గ్లింప్స్ బయటకు వచ్చింది. ఇక ఈ వీడియో నెట్టింట ఫుల్ వైరల్ అవుతోంది. ఇదివరకే వచ్చిన రారా దీవర సాంగ్ మంచి ఇంపాక్ట్ ని క్రియేట్ చేసింది. ఇక.ఇప్పుడు కృష్ణన్ రామన్ అనే యోధుడి పాత్రలో ఒదిగిపోవడానికి నిఖిల్ పడిన కష్టం లేటెస్ట్ వీడియోలో పర్ఫెక్ట్ గా కనిపిస్తోంది. తెర వెనుక జరిగిన 45 రోజుల కఠోర శిక్షణను ఇందులో అద్భుతంగా చూపించారు. మార్షల్ ఆర్ట్స్, కత్తిసాము లాంటి విద్యల్లో నిఖిల్ ట్రైనింగ్ తీసుకున్న తీరు ఆకట్టుకుంటోంది. నెలల తరబడి చెమటోడ్చి ఒక పవర్ ఫుల్ వారియర్ లా ఎలా మారాడో ఈ స్పెషల్ వీడియో ద్వారా మేకర్స్ రివీల్ చేశారు.




## సోనాలి బింద్రే రీఎంట్రీ

నిజ జీవిత ఘటనల ఆధారంగా తెరకెక్కే క్రైమ్ థ్రిల్లర్లకు ఎప్పుడూ మంచి రెస్పాన్స్ ఉంటుంది. ఇప్పుడు అదే తరహాలో ప్రేక్షకుల ముందుకు రానున్న వెబ్ సిరీస్ రాఖ్. అలీ ఫజల్, సోనాలి బింద్రే, అమీర్ బషీర్ లీడ్ రోల్స్ లో నటించిన ఆ ఇన్వెస్టిగేటివ్ క్రైమ్ డ్రామా ట్రైలర్ ను మేకర్స్ విడుదల చేశారు. 1970ల నాటి ఢిల్లీ నేపథ్యంలో సాగే ఆ కథ.. ఒకప్పుడు కుదిపేసిన రంగా-బిల్లా కేసు నేపథ్యంలో సాగింది. ట్రైలర్ ప్రారంభం నుంచే మిస్టరీ, టెన్షన్ తో నిండిపోయింది. ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఇద్దరు టీనేజ్ పిల్లలు కనిపించకుండా పోవడంతో కథ మొదలవుతుంది. మొదట సాధారణ మిస్సింగ్ కేసులా కనిపించిన ఆ ఘటన.. మెల్లగా భయంకరమైన ట్విస్టులు తిరుగుతుంది.

## దిల్ రాజు థియేటర్లలోనూ పెద్ది

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా దర్శకుడు బుచ్చిబాబు సన తెరకెక్కించిన భారీ చిత్రం 'పెద్ది' విడుదలకు ముందు నెలకొన్న అనిశ్చితి ఎట్టకేలకు తొలగిపోయింది. గత కొన్ని రోజులుగా టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారిన థియేటర్ల వివాదానికి తెరపడింది. ముఖ్యంగా దిల్ రాజు సంస్థకు చెందిన ఎస్వీసీ థియేటర్లలో 'పెద్ది' విడుదల అవుతుందా లేదా అనే సందేహాలకు ఇప్పుడు స్పష్టత వచ్చింది. తెలుగు సినీ పరిశ్రమలో నిర్మాతలు, ఎగ్జిబిటర్ల మధ్య రెంటల్ సిస్టమ్, పర్సెంటేజ్ సిస్టమ్ అంశాలపై నెలకొన్న విభేదాలు 'పెద్ది' విడుదలపై ప్రభావం చూపుతాయనే ప్రచారం జరిగింది. మరోవైపు ఎస్వీసీ డిస్ట్రిబ్యూషన్, మైత్రి డిస్ట్రిబ్యూషన్ మధ్య ఉన్న విభేదాల కారణంగా కూడా సినిమా విడుదలపై అనేక ఊహాగానాలు వినిపించాయి. ఆదివారం విడుదల చేసిన నైజాం థియేటర్ల తొలి జాబితాలో ఎస్వీసీ థియేటర్ల పేర్లు లేకపోవడంతో ఈ ప్రచారానికి మరింత బలం చేకూరింది. యితే తాజాగా జరిగిన చర్చల అనంతరం అన్ని సమస్యలు పరిష్కారమయ్యాయి. నైజాం ప్రాంతంలోని ఎస్వీసీ సంస్థకు చెందిన ప్రధాన థియేటర్లలో 'పెద్ది' ప్రదర్శనకు అంగీకారం కుదిరినట్లు సమాచారం. దీంతో దిల్ రాజు థియేటర్లలో కూడా 'పెద్ది' విడుదల ఖాయమైంది. ఈ నిర్ణయం రామ్ చరణ్ అభిమానులకు భారీ ఊరటనిచ్చింది. ప్రత్యేకంగా నిజామాబాద్‌లోని ప్రధాన స్క్రీన్లతో పాటు హైదరాబాద్‌లో అత్యంత ప్రతిష్టాత్మకమైన ఆర్టీసీ క్రాస్ రోడ్స్ ప్రాంతంలోని సుదర్శన్, దేవి థియేటర్ కాంప్లెక్స్‌లలో కూడా 'పెద్ది' విడుదల కానుంది.





## కోల్‌కతాలో మెస్సీ విగ్రహం తొలగింపు

కోల్‌కతాలో ఏర్పాటు చేసిన ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీ 70 అడుగుల భారీ విగ్రహాన్ని అధికారులు తొలగిస్తున్నారు. కేవలం ఆరు నెలల క్రితమే అత్యంత వైభవంగా ఆవిష్కరించిన ఈ విగ్రహం, బలమైన గాలులకు ప్రమాదకరంగా ఊగుతుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. సోమవారం ఉదయం నుంచే కోల్‌కతాలోని లేక్ టౌన్ ప్రాంతంలో హైడ్రాలిక్ క్రేన్ల సహాయంతో విగ్రహాన్ని తొలగించే పనులు ప్రారంభమయ్యాయి. గత వారం (మే 25న) బలమైన గాలులు వీచినప్పుడు, భూగర్భ పాదచారుల క్రాసింగ్‌పై ఏర్పాటు చేసిన ఈ భారీ ఫైబర్‌గ్లాస్ విగ్రహం తీవ్రంగా కదలడం స్థానికులను ఆందోళనకు గురిచేసింది. వారి ఫిర్యాదులతో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ ఇంజనీర్లు రంగంలోకి దిగి తనిఖీలు చేపట్టారు. విగ్రహం పునాది సరిగ్గా మధ్యలో లేదని, ఫిట్టింగులు వదులుగా ఉన్నాయని, నిర్మాణంలో పలు లోపాలు ఉన్నాయని వారు తమ నివేదికలో పేర్కొన్నారు. రుతుపవనాలు సమీపిస్తున్న తరుణంలో ఇది మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని హెచ్చరించారు. దీంతో అధికారులు తక్షణమే స్పందించి, విగ్రహాన్ని తొలగించాలని నిర్ణయించారు. అర్జెంటీనా 2022లో ఫుట్‌బాల్ ప్రపంచకప్ గెలిచిన సందర్భంగా మెస్సీకి, ఆయనకు భారతదేశంలో ఉన్న అశేష అభిమానులకు నివాళిగా ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. 2025 డిసెంబర్‌లో మెస్సీ తన 'గోట్ టూర్'లో భాగంగా భారత్‌లో పర్యటించినప్పుడు, స్వయంగా అతడే వర్చువల్‌గా ఈ విగ్రహాన్ని ఆవిష్కరించాడు. కోల్‌కతాలో మెస్సీకి ఉన్న అపారమైన అభిమానానికి ఇది ప్రతీకగా నిలుస్తుందని అందరూ భావించారు. అయితే, నాసిరకం నిర్మాణం కారణంగా ఆవిష్కరించిన ఆరు నెలలకే ఈ విగ్రహం తొలగింపునకు గురికావడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఒక గొప్ప క్రీడాకారుడికి ఇచ్చిన గౌరవం ఇలా అర్ధాంతరంగా ముగియడంపై అభిమానులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఈ విగ్రహాన్ని ఎకో పార్క్ వంటి సురక్షిత ప్రదేశానికి తరలించే అవకాశాన్ని పరిశీలిస్తున్నప్పటికీ, దీనిపై ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

## గిల్ గుజరాత్‌ను ముంచేశాడు

గుజరాత్ టైటాన్స్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌పై టీమిండియా మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా విమర్శలు గుప్పించాడు. గిల్ వైఫల్యం కారణంగానే గుజరాత్ టైటాన్స్ టైటిల్ గెలవలేకపోయిందని అభిప్రాయపడ్డాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో గుజరాత్ టైటాన్స్ రన్నరప్‌గా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్లో ఆర్సీబీ 5 వికెట్ల తేడాతో గుజరాత్ టైటాన్స్‌ను ఓడించింది. కీలకమైన ఫైనల్లో గుజరాత్ బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. వాషింగ్టన్ సుందర్ మినహా మరే బ్యాటర్ రాణించలేకపోయాడు. ఈ మ్యాచ్‌పై తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా మాట్లాడిన ఆకాశ్ చోప్రా.. శుభ్‌మన్ గిల్ చెత్త షాట్ ఆడి వికెట్ పారేసుకున్నాడని తెలిపాడు. అతను ఔటైన తీరు చూస్తే తనకు 2023 వన్డే ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్ గుర్తొచ్చిందని చెప్పాడు. 'గుజరాత్ టైటాన్స్ ఆట ఆరంభించిన విధానం.. ఆపై శుభ్‌మన్ గిల్ వికెట్ పడిన తీరు చూశాక.. వారు నిలదొక్కుకుంటారని నేను అనుకోలేదు. నిజానికి అది వికెట్ పడే బంతి ఎంతమాత్రం కాదు. అంతకుముందు బంతికే గిల్ ఫోర్ కొట్టాడు. కానీ, ఆ తర్వాతి బంతికే పెద్ద షాట్‌కు ప్రయత్నిస్తూ ఔట్ అయ్యాడు. శుభ్‌మన్ గిల్‌కు ఈ సీజన్ అద్భుతంగా సాగింది. తన బ్యాటింగ్‌తో ఈ సీజన్‌లో పూర్తి ఆధిపత్యం చెలాయించాడు. కానీ కీలకమైన ఫైనల్లో చేతులెత్తేసాడు. శుభ్‌మన్ గిల్ ఔట్ అయిన తీరు చూస్తే నాకు వన్డే ప్రపంచకప్ 2023 ఫైనల్ గుర్తుకొస్తోంది'అని ఆకాష్ చోప్రా విశ్లేషించాడు.

## వైభవ్ భవిష్యత్తుకు మాది పూచీ: బీసీసీఐ

ఐపీఎల్ 19వ సీజన్‌లో చితక్కొట్టిన వైభవ్ సూర్యవంశీ భవితవ్యం ఏంటీ?.. ఇప్పుడు దేశవ్యాప్తంగా అభిమానుల్లో ఇదే చర్చ. 15 ఏళ్లకే సంచలన ఆటతో దిగ్గజాలను ఆశ్చర్యపరుస్తున్న వైభవ్‌ను త్వరలోనే సీనియర్ జట్టుకు ఆడించాలనే డిమాండ్లు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ కుర్రాడిని మరింత రాటుదేల్చడంపై భారత క్రికెట్ నియంత్రణ మండలి దృష్టి సారిస్తోంది. రెండోసారి విజేత ఆర్సీబీ జట్టుకు ట్రోఫీ బహుకరణ అనంతరం కార్యదర్శి దేవజిత్ సైకియా మాట్లాడుతూ వైభవ్ భవితకు పూచీ మాది అని చెప్పాడు.'19వ సీజన్ అద్భుతంగా సాగింది. అభిమానులు ఎంతో ఆస్వాదించారనుకుంటున్నా. వరసగా రెండోసారి విజేతగా నిలిచిన ఆర్సీబీకి శుభాకాంక్షలు. వైభవ్ విషయానికొస్తే.. అతడు అద్భుతమైన క్రికెటర్. అతడికి ఉజ్వలమైన భవిష్యత్ ఉంది.



# సంబరాల 'బెంగ'ళూరు

## నేరుగా ఇళ్లకే ఆర్సీబీ ఆటగాళ్లు

**వరుసగా రెండోసారి ఐపీఎల్ ఛాంపియన్‌గా నిలిచిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) జట్టు తమ విజయాన్ని అభిమానులతో పంచుకోవడానికి కొంత సమయం పట్టేలా ఉంది. టైటిల్ గెలిచిన వెంటనే జట్టు ఆటగాళ్లు, సహాయక సిబ్బంది అహ్మదాబాద్ నుంచే నేరుగా తమ ఇళ్లకు, సెలవులకు బయల్దేరి వెళ్లనున్నారు. ఈ విషయాన్ని ఆర్సీబీ డైరెక్టర్ ఆఫ్ క్రికెట్ మో బొబాట్ సోమవారం మీడియాకు వెల్లడించారు.**

"దురదృష్టవశాత్తు మేమెవరమూ బెంగళూరు వెళ్లడం లేదు. నేను యూకేకు తిరిగి వెళ్తున్నాను. రజత్ తన కుటుంబంతో సమయం గడపడానికి ఇంటికి వెళుతున్నాడు. హెడ్ కోచ్ ఆండీ ఫ్లవర్ హాలిడే ప్లాన్ చేసుకున్నాడు. కాబట్టి మా అభిమానులను కలుసుకోవడానికి మరికొంత కాలం వేచి ఉండాలి" అని బొబాట్ తెలిపారు.



ఒకప్పుడు ఐపీఎల్‌లో 'అండర్ అచీవర్స్'గా ముద్రపడిన ఆర్సీబీ, 2025 నుంచి అద్భుతంగా పుంజుకుని వరుసగా రెండు టైటిళ్లు గెలుచుకుంది. ఈ భారీ మార్పు వెనుక డేటా, అనలిటిక్స్‌తో కూడిన సమతుల్య విధానం కీలక పాత్ర పోషించిందని బొబాట్, కెప్టెన్ రజత్ పటీదార్ వివరించారు. లీడ్ అనలిస్ట్ ఫ్రెడ్డీ వైల్డ్, హెడ్ కోచ్ ఆండీ ఫ్లవర్, మెంటార్ దినేశ్ కార్తీక్ వంటి వారి ఆధ్వర్యంలో జట్టును నిర్మించడం నుంచి మ్యాచ్ వ్యూహాల వరకు ప్రతి విషయంలో డేటా ఆధారిత నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు. "మేం కేవలం డేటాపైనే ఆధారపడం. ఆధారాలతో కూడిన నిర్ణయాలు తీసుకోవడానికి ప్రాధాన్యత ఇస్తాం. ఇందులో డేటాతో పాటు నిపుణుల అనుభవం, అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకుంటాం" అని బొబాట్ అన్నారు. ఈ విజయాల్లో అనలిస్ట్ ఫ్రెడ్డీ వైల్డ్ పాత్ర ఎంతో కీలకమని ఆయన ప్రశంసించారు. కెప్టెన్ రజత్ పటీదార్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. ఫాస్ట్ బౌలింగ్‌ను ఎదుర్కోవడంలో తన ఆటతీరు మెరుగుపడటానికి ఫ్రెడ్డీ విశ్లేషణ ఎంతగానో ఉపయోగపడిందని చెప్పాడు. "కొందరు బౌలర్లను అర్థం చేసుకోవడంలో ఇబ్బంది పడినప్పుడు ఫ్రెడ్డీని సంప్రదించాను. అతని సూచనలు నా బ్యాటింగ్‌ను మెరుగుపరిచాయి. నా ఆటతీరులో మార్పుకు కారణం ఫ్రెడ్డీనే" అని పటీదార్ స్పష్టం చేశాడు.

### తెలుగు రాష్ట్రాల్లో అభిమానుల వీరంగం

ఐపీఎల్ 2026 ఫైనల్‌లో గుజరాత్ టైటాన్స్‌పై రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) విజయం సాధించడంతో తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో సంబరాలు శ్రుతిమించాయి. అభిమానుల ఆనందం అదుపుతప్పి, పౌర స్పృహ లోపించడంతో కొన్నిచోట్ల ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. ఈ ఘటనలపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆదివారం రాత్రి కర్నూలులో వందలాది మంది ఆర్సీబీ అభిమానులు జెండాలు, బ్యానర్లతో రోడ్లపైకి వచ్చి హంగామా సృష్టించారు. దీంతో భారీగా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. పరిస్థితి అదుపు తప్పుతున్న క్రమంలో ఒక గుంపు, రోడ్డు పక్కన ఆగి ఉన్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుపై రాళ్లతో దాడి చేసింది. ఈ ఘటనలో బస్సు అద్దాలు ధ్వంసం కాగా, లోపలున్న ప్రయాణికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని, దాదాపు గంటపాటు శ్రమించి ఆందోళనకారులను చెదరగొట్టారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. ఇలాంటి ఘటనే హైదరాబాద్‌లోనూ చోటుచేసుకుంది. సచివాలయం, ట్యాంక్ బండ్, ఎస్ఆర్ నగర్, కూకట్‌పల్లి, డీఎల్ఎఫ్ గచ్చిబౌలి వంటి కీలక ప్రాంతాల్లో అభిమానులు పెద్ద సంఖ్యలో గుమిగూడి సంబరాలు జరుపుకున్నారు. కొన్నిచోట్ల పరిస్థితి అదుపు తప్పడంతో పోలీసులు స్వల్పంగా లాఠీచార్జ్ చేసి జనాలను చెదరగొట్టి, ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.



## ఆత్మవిశ్వాసమే మా గెలుపు: ఆండీ ఫ్లవర్

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) వరుసగా రెండోసారి ఐపీఎల్ టైటిల్ గెలవడం వెనుక ఉన్న రహస్యాన్ని హెడ్ కోచ్ ఆండీ ఫ్లవర్ వివరించాడు. 2025లో తొలి టైటిల్ గెలిచినప్పటి ఉద్విగ్నభరిత వాతావరణానికి, 2026లో టైటిల్‌ను నిలబెట్టుకున్నప్పటి నిలకడైన ప్రదర్శనకు మధ్య ఉన్న తేడాను ఫ్లవర్ విశ్లేషించాడు. ఈసారి జట్టులో ప్రగాఢ ఆత్మవిశ్వాసం ఉండటమే తమ విజయానికి ప్రధాన కారణమని స్పష్టం చేశాడు. సోమవారం జరిగిన వర్చువల్ మీడియా సమావేశంలో ఫ్లవర్ మాట్లాడుతూ, 2024 సీజన్‌లో ఎదురైన కఠిన సవాళ్లే తమను బలోపేతం చేశాయని అన్నాడు. "2025, 2026 టైటిల్ విజయాల మధ్య కచ్చితంగా తేడాలు ఉన్నాయి. అయితే నేను 2024 సీజన్‌ను కూడా గుర్తుచేసుకోవాలి. ఆ ఏడాది తొలి అర్ధభాగంలో ఎదురైన పరాజయాలు మాలో పట్టుదలను పెంచాయి. వ్యూహాత్మకంగా కొన్ని మార్పులు చేసుకోవడానికి, ధైర్యంగా నిర్ణయాలు తీసుకోవడానికి ఆ పరిస్థితులే కారణం" అని ఫ్లవర్ తెలిపాడు. ఫ్లవర్ ఇంకా వివరిస్తూ, "2025లో తొలిసారి టైటిల్ గెలిచాం. అయితే, ఆర్సీబీకి గతంలో టైటిల్ గెలిచిన అనుభవం లేకపోవడంతో ఆ సీజన్ లో చాలా ఒత్తిడి, అనిశ్చితి ఉండేవి. కానీ ఈ ఏడాది పరిస్థితి భిన్నంగా ఉంది. గత ఏడాది టైటిల్ గెలిచిన తర్వాత జట్టులో ఆత్మవిశ్వాసం రెట్టింపు అయింది. విరాట్ కోహ్లీ, భువనేశ్వర్ కుమార్, హేజిల్‌వుడ్, కృనాల్ పాండ్యా వంటి అనుభవజ్ఞులైన ఆటగాళ్లు జట్టులో ఉండటం కోచింగ్ సిబ్బందిగా మా పనిని సులభతరం చేసింది.

## వెలుతురు తగ్గితే పింక్ బాల్



**డ్రింక్స్ బ్రేక్‌లో మైదానంలోకి కోచ్‌లు**

**బౌలింగ్ డౌట్ ఉంటే హాక్-ఐ వాడకం**

**క్రికెట్ కెనడాపై సస్పెన్షన్ వేటు**

**క్రికెట్‌లో ఐసీసీ కీలక నిర్ణయాలు**

**అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) టెస్ట్ క్రికెట్‌లో పలు కీలక మార్పులకు ఆమోదముద్ర వేసింది. అహ్మదాబాద్‌లో జరిగిన వార్షిక బోర్డు సమావేశంలో తీసుకున్న ఈ నిర్ణయాలలో ముఖ్యమైనది, వెలుతురు మందగించినప్పుడు పింక్ బాల్ వాడకం. టెస్ట్ మ్యాచ్‌లలో వెలుతురులేమి కారణంగా ఆట నిలిచిపోకుండా, పూర్తి ఓవర్లు జరిగేలా చూడటమే ఈ ప్రయోగం ముఖ్య ఉద్దేశం.**

ఈ కొత్త నిబంధన ప్రకారం, టెస్ట్ మ్యాచ్ ఎప్పటిలాగే రెడ్ బాల్‌తో ప్రారంభమవుతుంది. ఒకవేళ ఆట మధ్యలో వెలుతురు తగ్గితే, ఫ్లడ్‌లైట్ల వెలుగులో పింక్ బాల్‌తో ఆటను కొనసాగించవచ్చు. అయితే, సిరీస్ ప్రారంభానికి ముందే ఇరు జట్లు దీనికి అంగీకరించాల్సి ఉంటుంది. ఉదాహరణకు, 90 ఓవర్ల ఆటలో 75 ఓవర్లు ముగిశాక వెలుతురు తగ్గితే, మిగిలిన ఓవర్లను పింక్ బాల్‌తో పూర్తి చేస్తారు. దీంతో పాటు మరికొన్ని ముఖ్యమైన నిబంధనలను కూడా ఐసీసీ ఆమోదించింది. ఇకపై డ్రింక్స్ విరామ సమయంలో హెడ్ కోచ్‌లు మైదానంలోకి వచ్చి ఆటగాళ్లతో మాట్లాడేందుకు అనుమతి ఇచ్చారు. అలాగే, బౌలర్ల సందేహాస్పద యాక్షన్‌ను పర్యవేక్షించేందుకు మ్యాచ్ అధికారులు హాక్-ఐ డేటాను ఉపయోగించుకోవచ్చు. ఇప్పటివరకు ప్రయోగాత్మకంగా ఉన్న లెగ్-సైడ్ వైడ్ల నిబంధనను శాశ్వతం చేశారు. టీ20 మ్యాచ్‌లలో 15 నిమిషాల విరామాన్ని తప్పనిసరి చేసింది. ఆట తిరిగి ప్రారంభమైనప్పుడు బ్యాట్స్‌మెన్ సిద్ధంగా ఉండాలని పేర్కొంది. మరోవైపు, నిబంధనల ఉల్లంఘన కారణంగా క్రికెట్ కెనడా సభ్యత్వంపై ఐసీసీ తక్షణమే సస్పెన్షన్ వేటు వేసింది. అయితే, సస్పెన్షన్ కాలంలోనూ కెనడా జాతీయ జట్లు ఐసీసీ ఈవెంట్లలో పాల్గొనవచ్చని స్పష్టం చేసింది. ఈ కొత్త నిబంధనలన్నీ 2026 అక్టోబర్ 1 నుంచి అమల్లోకి రానున్నాయి. క్రికెట్ కెనడాకు సభ్యత్వాన్ని పునరుద్ధరించుకోవడానికి కొన్ని కఠినమైన షరతులు విధించింది. ఈ ప్రక్రియను ఐసీసీ నార్మలైజేషన్ కమిటీ పర్యవేక్షిస్తుంది. వారు నిర్దేశించిన మార్పులను, నిబంధనలను విజయవంతంగా అమలు చేస్తేనే క్రికెట్ కెనడా సభ్యత్వాన్ని తిరిగి పునరుద్ధరిస్తారు. అప్పటివరకు వారి సభ్యత్వం ప్రమాదంలో ఉన్నట్లేనని ఐసీసీ పరోక్షంగా సూచించింది. ఐసీసీ బోర్డు మహిళల క్రికెట్‌కు సంబంధించి కూడా కీలక నిర్ణయాలు ఆమోదించింది. ఐసీసీ మహిళల ఛాంపియన్స్ ట్రోఫీ 2027 టోర్నమెంట్ తేదీలను మార్చింది. ఈ టోర్నీని 2027 ఫిబ్రవరి 14 నుంచి 28 వరకు నిర్వహించనున్నారు. దీంతో పాటు, 2026లో 'ఐసీసీ మహిళల ఎమర్జింగ్ నేషన్స్ ట్రోఫీ'ని ప్రారంభించనున్నట్లు బోర్డు ధ్రువీకరించింది. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 10 జట్లు పాల్గొంటాయి. వీటిలో ఐదు పూర్తిస్థాయి సభ్య దేశాలు, ఐదు అసోసియేట్ సభ్య దేశాలు ఉంటాయి. ర్యాంకింగ్‌లు, గత టీ20 ప్రపంచకప్ క్వాలిఫికేషన్ ప్రదర్శనల ఆధారంగా జట్లను ఎంపిక చేయనున్నారు.

ఈవార్తలు
# ప్రజావాణి
www.evarthalu.com
నేటి ఈవార్తలు
మంగళవారం 2-6-2026, జగిత్యాల


నేటి ఈవార్తలు సంపాదకీయం Editorial

# తెలంగాణ నవ నిర్మాణ వైభవం

భారతదేశ పటంలో 29వ రాష్ట్రంగా అవతరించిన తెలంగాణ, గడిచిన పుష్కర కాలంలో ఒక సరికొత్త చరిత్రను లిఖించింది. ఎన్నో పోరాటాలు, త్యాగాల మధ్య ఏర్పడిన ఈ లేత రాష్ట్రం, గత, ప్రస్తుత ప్రభుత్వాల హయాంలో సాధించిన ఘనతలు దేశానికే రోల్ మోడల్‌గా నిలిచాయి. సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా చేసుకుని సాగిన పాలన తెలంగాణ రూపురేఖలను శాశ్వతంగా మార్చివేసింది. ఒకప్పుడు ఎండిపోయిన చెరువులు, వలసలతో అలమటించిన తెలంగాణను కేసీఆర్ ప్రభుత్వం జలశోభితంగా మార్చింది. ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకం 'కాళేశ్వరం' ప్రాజెక్టును రికార్డు సమయంలో పూర్తి చేయడం ఒక అద్భుతం. 'మిషన్ కాకతీయ' ద్వారా వేలాది చెరువులకు పునర్జీవం పోసి, 'మిషన్ భగీరథ' ద్వారా ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీరు అందించిన తీరు అమోఘం. ఈ జల విప్లవంతో తెలంగాణ నేడు దేశానికే అన్నపూర్ణగా అవతరించింది వ్యవసాయాన్ని పండుగలా మార్చిన ఘనత గత ప్రభుత్వానిదే. 'రైతు బంధు' పథకం ద్వారా పెట్టుబడి సాయం అందించి దేశవ్యాప్త మేధావుల ప్రశంసలు అందుకుంది. ఉచిత 24 గంటల నాణ్యమైన విద్యుత్, 'రైతు బీమా' వంటి విప్లవాత్మక నిర్ణయాలు అన్నదాతకు కొండంత అండగా నిలిచాయి. సమాజంలో వెనుకబడిన వర్గాల కోసం ప్రవేశపెట్టిన పథకాలు మానవీయ పాలనకు నిదర్శనం. ఆసరా పెన్షన్లు, కల్యాణ లక్ష్మి/షాదీ ముబారక్, దళిత బంధు, కేసీఆర్ కిట్ వంటి పథకాలు పేద కుటుంబాలలో వెలుగులు నింపాయి. గురుకుల విద్యాలయాల స్థాపన ద్వారా పేద విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి కార్పొరేట్ విద్యను ఉచితంగా అందించడం రాబోయే తరాలకు చేసిన గొప్ప పెట్టుబడి. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు స్థిరమైన విధానాల వల్ల హైదరాబాద్ నగరం ప్రపంచ ఐటీ హబ్‌గా ఎదిగింది. టీ-హబ్, వీ-హబ్ వంటి వేదికలు నూతన ఆవిష్కరణలకు కేంద్రాలుగా మారాయి. పారిశ్రామిక అనుమతుల కోసం తెచ్చిన 'టీఎస్-ఐపాస్' చట్టం వల్ల వేల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి తరలివచ్చాయి. లక్షల మంది యువతకు ఉపాధి లభించింది. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం వేళ ఈ బలమైన పునాదులను స్మరించుకోవడం మన బాధ్యత. రాజకీయాలకతీతంగా, ఒక సంక్షేమ రాష్ట్ర స్థాపన కోసం, భౌగోళిక పునర్నిర్మాణం కోసం చూపిన చొరవ, సాధించిన విజయాలు తెలంగాణ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించి ఉంటాయి. ఈ పుష్కర కాల ప్రగతిని స్ఫూర్తిగా తీసుకుని, రాష్ట్రం మరింత ఉన్నత శిఖరాలకు చేరాలి.

ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగం అత్యున్నత చట్టపరమైన పత్రం. దేశ పాలన ఎలా ఉండాలి, అధికార విభజన ఏ విధంగా జరగాలి, ప్రజల హక్కులు ఎలా రక్షించబడాలి, ప్రభుత్వ బాధ్యతలు ఏమిటి వంటి అంశాలను అది నిర్దేశిస్తుంది. అయితే రాజ్యాంగం ఎంత గొప్పదైనా, దానిని అమలు చేసే వ్యక్తుల ప్రవర్తనపై ప్రజాస్వామ్య నాణ్యత ఆధారపడి ఉంటుంది. ముఖ్యంగా రాజకీయ నాయకులు రాజ్యాంగం ద్వారా పొందిన అధికారాన్ని ఎలా వినియోగిస్తున్నారన్నది దేశ భవిష్యత్తును ప్రభావితం చేసే అంశం. స్వాతంత్ర్యం తర్వాత భారతదేశం ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి శాసనసభలు, న్యాయవ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థ, ఎన్నికల సంఘం వంటి అనేక రాజ్యాంగబద్ధ సంస్థలను ఏర్పాటు చేసింది. ఈ సంస్థల లక్ష్యం అధికార సమతుల్యతను కాపాడటం, ప్రజల హక్కులను రక్షించడం. అయితే కాలక్రమేణా అధికార కేంద్రీకరణ, వ్యక్తిగత రాజకీయ ప్రయోజనాల ప్రాధాన్యం, సంస్థలపై రాజకీయ ప్రభావం పెరుగుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

# రాజ్యాంగం.. రాజకీయం



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

ప్రస్తుత కాలంలో రాజకీయాల స్వరూపంలో గణనీయమైన మార్పులు కనిపిస్తున్నాయి. ఒకప్పుడు ప్రజాసేవ ప్రధాన లక్ష్యంగా భావించిన రాజకీయాలు, ఇప్పుడు ఎన్నికల గణితం, ప్రచార వ్యూహాలు, మీడియా నిర్వహణ, సామాజిక మాధ్యమాల ప్రభావం వంటి అంశాల చుట్టూ తిరుగుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రజల సమస్యల పరిష్కారం కంటే ఎన్నికల విజయం ప్రధాన లక్ష్యంగా మారుతోందన్న విమర్శలు కూడా ఉన్నాయి. రాజ్యాంగం నాయకులకు అధికారం ఇచ్చినప్పటికీ, దానికి పరిమితులు కూడా విధించింది. కానీ కొన్ని సందర్భాల్లో అధికారాన్ని ప్రజా సంక్షేమం కోసం కాకుండా రాజకీయ ప్రత్యర్థులను బలహీనపరచడానికి, పరిపాలనా వ్యవస్థను ప్రభావితం చేయడానికి లేదా సంస్థలను తమకు అనుకూలంగా మలచుకోవడానికి ఉపయోగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తుంటాయి. ఇలాంటి ధోరణులు ప్రజాస్వామ్య సంస్థల స్వతంత్రతను బలహీనపరిచే ప్రమాదం కలిగి ఉంటాయి.

వ్యక్తి కేంద్రిత రాజకీయాల పెరుగుదల కూడా ఒక ప్రధాన ఆందోళన. ప్రజాస్వామ్యంలో సంస్థలు ప్రధానమైనవి కావాలి. కానీ అనేక ప్రాంతాల్లో వ్యక్తులే వ్యవస్థలుగా మారిపోతున్నారు. పార్టీ కంటే నాయకుడు, విధానం కంటే వ్యక్తిత్వం, ప్రజా చర్చ కంటే ప్రచారం ఎక్కువ ప్రాధాన్యం పొందుతోంది. దీనివల్ల ప్రజాస్వామ్య సంభాషణ బలహీనపడుతోంది. ఎన్నికల సమయంలో ఇచ్చే హామీలు కూడా పరిశీలనకు అర్హమైన అంశం. ప్రజలను ఆకర్షించే వాగ్దానాలు అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తిగా అమలు కాకపోవడం వల్ల రాజకీయ వ్యవస్థపై ప్రజల విశ్వాసం తగ్గుతుంది. ఎన్నికల హామీల అమలుపై సమర్థవంతమైన జవాబుదారీతనం లేకపోవడం ఈ సమస్యకు కారణంగా కనిపిస్తుంది. రాజ్యాంగబద్ధ సంస్థల స్వతంత్రత ప్రజాస్వామ్య ఆరోగ్యానికి అత్యంత అవసరం. ఎన్నికల సంఘం, న్యాయవ్యవస్థ, సమాచార హక్కు సంస్థలు, దర్యాప్తు సంస్థలు వంటి వ్యవస్థలు రాజకీయ ప్రభావాలకు అతీతంగా పనిచేయాలి. సంస్థలపై ప్రజల విశ్వాసం తగ్గితే ప్రజాస్వామ్య వ్యవస్థ పునాదులే బలహీనపడతాయి. మీడియా కూడా ప్రజాస్వామ్యంలో కీలక పాత్ర పోషిస్తుంది. సంప్రదాయంగా మీడియా అధికారాన్ని ప్రశ్నించే సాధనంగా ఉండేది. అయితే ప్రస్తుతం రాజకీయ, ఆర్థిక ప్రయోజనాల ప్రభావం పెరిగిందనే విమర్శలు ఉన్నాయి. సామాజిక మాధ్యమాల విస్తరణతో సమాచారం వేగంగా ప్రజలకు చేరుతున్నప్పటికీ, తప్పుడు ప్రచారాలు, అపోహలు కూడా అదే స్థాయిలో వ్యాప్తి చెందుతున్నాయి. అందువల్ల ప్రజలు సమాచారాన్ని విమర్శనాత్మక దృష్టితో పరిశీలించే అలవాటు పెంపొందించుకోవాలి.

రాజకీయ నాయకుల ప్రభావం పరిపాలనా వ్యవస్థపై కూడా స్పష్టంగా కనిపిస్తుంది. అధికారులు చట్టాలకు అనుగుణంగా స్వతంత్రంగా పనిచేయాల్సి ఉన్నప్పటికీ, రాజకీయ జోక్యం కారణంగా బదిలీలు, నియామకాలు, పదోన్నతులు ప్రభావితమవుతున్నాయనే ఆరోపణలు తరచుగా వినిపిస్తుంటాయి. దీని ఫలితంగా ప్రజలకు అందాల్సిన సేవల నాణ్యత తగ్గే ప్రమాదం ఉంది. ప్రచార రాజకీయాల విస్తరణ కూడా ఆధునిక రాజకీయాల ప్రత్యేక లక్షణంగా మారింది. ప్రభుత్వ పనితీరు కంటే ప్రచార కార్యక్రమాలు, భారీ ప్రకటనలు, వ్యక్తిగత ఇమేజ్ నిర్మాణం ఎక్కువ ప్రాధాన్యం పొందుతున్నాయి. ప్రజలకు సమాచారం అందించడం అవసరమే అయినప్పటికీ, ప్రచారం వాస్తవాలను మించిపోతే ప్రజలు సరైన నిర్ణయాలు తీసుకోవడం కష్టమవుతుంది. సామాజిక మాధ్యమాలు రాజకీయ నాయకులకు ప్రజలతో నేరుగా సంభాషించే అవకాశాన్ని కల్పించాయి. కానీ అదే సమయంలో సమాచారాన్ని నియంత్రించే సాధనంగా కూడా మారాయి. నాయకులు తమకు అనుకూల అంశాలను మాత్రమే ప్రాధాన్యంగా చూపిస్తూ విమర్శాత్మక అంశాలను పక్కనపెట్టే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రజాస్వామ్యంలో విభిన్న అభిప్రాయాలకు స్థానం ఉండటం అత్యంత ముఖ్యం. ప్రతిపక్షాల పాత్ర కూడా ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకం. అధికార పక్షాన్ని ప్రశ్నించడం, ప్రత్యామ్నాయ విధానాలను సూచించడం, ప్రజల సమస్యలను ముందుకు తీసుకురావడం ప్రతిపక్ష బాధ్యత. బలమైన ప్రతిపక్షం లేకపోతే అధికారంపై పర్యవేక్షణ తగ్గి నిర్ణయాలు ఏకపక్షంగా మారే ప్రమాదం ఉంటుంది. రాజకీయాల్లో ధన ప్రభావం పెరగడం మరో ప్రధాన సవాలు. ఎన్నికల ఖర్చులు భారీగా పెరగడంతో సాధారణ వ్యక్తులకు రాజకీయాల్లో ప్రవేశం కష్టమవుతోంది. అధిక ఆర్థిక వనరులు కలిగిన వ్యక్తులు లేదా సంస్థల మద్దతు ఉన్నవారే ప్రభావం చూపగలుగుతున్నారనే అభిప్రాయం ఉంది. ఇది ప్రజాస్వామ్య సమానత్వ సూత్రాన్ని బలహీనపరచే అవకాశం కలిగి ఉంది. వంశపారంపర్య రాజకీయాలు కూడా ప్రజాస్వామ్య ఆత్మకు సవాలుగా నిలుస్తున్నాయి. రాజకీయ నాయకత్వం కొద్దిమంది కుటుంబాల చుట్టూ కేంద్రీకృతమైతే కొత్త నాయకత్వం ఎదగడానికి అవకాశాలు తగ్గుతాయి. ప్రజాస్వామ్యం బలపడాలంటే రాజకీయాల్లో సమాన అవకాశాలు కల్పించాలి. ప్రజా ధన వినియోగం విషయంలో కూడా రాజకీయ నాయకులపై అధిక బాధ్యత ఉంటుంది. ప్రజల పన్నుల ద్వారా సమకూరిన నిధులను సమర్థవంతంగా వినియోగించాలి. కానీ కొన్నిసార్లు ప్రజా ప్రయోజనాల కంటే రాజకీయ లాభాల కోసం ఖర్చులు జరుగుతున్నాయనే విమర్శలు వినిపిస్తుంటాయి. దీర్ఘకాలిక అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఆర్థిక నిర్ణయాలు తీసుకోవడం అవసరం. ప్రజాస్వామ్యంలో నైతిక విలువల ప్రాముఖ్యత కూడా ఎంతో కీలకం. చట్టబద్ధతతో పాటు పారదర్శకత, జవాబుదారీతనం, నిజాయితీ వంటి విలువలు రాజకీయ నాయకత్వానికి అవసరం. ప్రజా జీవితంలో నైతిక ప్రమాణాలు బలహీనపడితే ప్రజాస్వామ్యం కేవలం ఎన్నికల ప్రక్రియగా మాత్రమే మిగిలిపోయే ప్రమాదం ఉంటుంది.

యువత రాజకీయాలపై చూపుతున్న ఆసక్తి కూడా ఆశాజనక పరిణామం. యువత పారదర్శక పాలన, అవినీతి రహిత పరిపాలన, సమాన అవకాశాలను కోరుకుంటోంది. రాజకీయ నాయకులు ఈ ఆకాంక్షలను అర్థం చేసుకుని విధానాలను రూపొందించాల్సిన అవసరం ఉంది. యువత రాజకీయాల్లో చురుకైన భాగస్వామ్యం ప్రజాస్వామ్య భవిష్యత్తుకు బలమైన పునాది అవుతుంది. రాజకీయ నాయకుల భాషా సంస్కృతి కూడా ప్రజాస్వామ్య నాణ్యతను ప్రభావితం చేస్తుంది. విభేదాలను శత్రుత్వంగా మార్చడం, వ్యక్తిగత దాడులు చేయడం, అవమానకర వ్యాఖ్యలు చేయడం వంటి ధోరణులు రాజకీయ సంస్కృతిని దిగజారుస్తాయి. పరస్పర గౌరవంతో కూడిన చర్చలు ప్రజాస్వామ్యాన్ని మరింత బలపరుస్తాయి. భారత రాజ్యాంగ నిర్మాతలు ఊహించిన ప్రజాస్వామ్యం కేవలం ఎన్నికలకే పరిమితం కాదు. అది సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం, సౌభ్రాతృత్వం అనే విలువలపై ఆధారపడి ఉంటుంది. రాజకీయ నాయకులు ఈ విలువలను కాపాడాల్సిన బాధ్యత కలిగి ఉంటారు. అధికారం ప్రజల నుండి వస్తుందనే విషయాన్ని ఎప్పటికప్పుడు గుర్తుంచుకోవాలి. అదే సమయంలో ప్రజల బాధ్యత కూడా తక్కువ కాదు. ఓటు హక్కును బాధ్యతతో వినియోగించడం, ప్రభుత్వ పనితీరును పరిశీలించడం, ప్రజా విధానాలపై చర్చించడం, పారదర్శకతను డిమాండ్ చేయడం వంటి చర్యలు ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తాయి. చైతన్యవంతమైన ప్రజలు ఉన్నచోట అధికార దుర్వినియోగం తగ్గుతుంది. భవిష్యత్తులో భారత ప్రజాస్వామ్యం మరింత బలపడాలంటే ఎన్నికల సంస్కరణలు, రాజకీయ నిధుల పారదర్శకత, సంస్థల స్వతంత్రత, బాధ్యతాయుత మీడియా, పౌర చైతన్యం వంటి అంశాలు సమగ్రంగా బలోపేతం కావాలి. ప్రజాస్వామ్యం కేవలం ఓటు వేయడమే కాదు; అది నిరంతర పర్యవేక్షణ, చర్చ, జవాబుదారీతనం, ప్రజల భాగస్వామ్యం అనే విలువల సమాహారం. ముగింపుగా చెప్పాలంటే, రాజ్యాంగ వ్యవస్థ చేతిలో అధికారం ఉన్న రాజకీయ నాయకుల వ్యవహార తీరు ప్రజాస్వామ్య ఆరోగ్యాన్ని ప్రతిబింబించే అద్దంలాంటిది. అధికారం సేవగా మారితే ప్రజాస్వామ్యం బలపడుతుంది. అధికారం ఆధిపత్యంగా మారితే ప్రజాస్వామ్యం బలహీనపడుతుంది. అందువల్ల బాధ్యతాయుతమైన రాజకీయ నాయకత్వం, స్వతంత్ర సంస్థలు, అప్రమత్తమైన ప్రజలు అనే మూడు స్తంభాలపై ప్రజాస్వామ్య భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. రాజ్యాంగ విలువలను కాపాడుతూ ప్రజా ప్రయోజనాలను కేంద్రంగా ఉంచిన రాజకీయ సంస్కృతి ఏర్పడినప్పుడే నిజమైన ప్రజాస్వామ్య పరిపాలన సాధ్యమవుతుంది.

# పాలోనివా? పక్కలో బల్లానివా?

## మన వాడే మనకు వెన్నుపోటు పొడిచే కాలం దాపురించెరా..!!

## ఆనాడు ఉద్యమ కాలంలో వినిపించిన 'మాటలే' మళ్లీ వినిపిస్తున్నాయి..




యస్.. ఇప్పుడు కూడా అదే జరుగుతోంది. తెలంగాణ పురుడు పోసుకున్న దశాబ్దకాలం తర్వాత.. మళ్లీ ఆంధ్రా కబంధ హస్తాల్లో తెలంగాణ తల్లి బందీ అవుతోందా? సెక్రటేరియట్ నిండా... మళ్లీ ఆ దొంగలే నిండారా? అంటే అవుననే సమాధానం వస్తోంది. ఓవైపు తెలంగాణలో యువత ఉద్యోగాల కోసం రోడ్ల మీద.. పొట్ట చేత పట్టుకుని... అన్నమో రామచంద్రా అని అర్రులు చాస్తుంటే.. ఆంధ్రా నుంచి వచ్చిన వలస వాదులకు కాంట్రాక్ట్ బేసిస్ మీద ఉద్యోగాలు కల్పిస్తున్నారు. లక్షలకు లక్షలు జీతాలు కట్టబెడుతున్నారు. పోనీ ఆంధ్రాలో ఉన్న మన తెలంగాణ బిడ్డలను తీసుకువస్తున్నారా? అంటే అదీ లేదు. ఉద్యోగాల విషయంలో తెలంగాణ యువతకు అదే అన్యాయం జరుగుతోంది. వడ్డించేవాడు మనోడు అయితే.. బంతిలో ఎక్కడ కూర్చున్నా ఒక్కటేననేది సామెత.. కానీ ఇక్కడ అందుకు భిన్నంగా జరుగుతోంది. వడ్డించే వాడు మనోడే.. ఆ మనోడే మనకు పగోడుగా మారాడు. అర్హత ఉన్నా.. ఆదుకునేందుకు చేయి ఇచ్చే అధికారం ఉన్నా.. పెట్టే మనసు లేక.. పెట్టేందుకు చేయి రాక... ఇంకా ఆంధ్రా పాలకుల మోచేతి నీళ్లు తాగుతూ తెలంగాణ జాతికి ద్రోహం చేస్తున్నారు. అన్నదమ్ముల్లా కలిసుందాం.. అన్న మాటలు ఏమయ్యాయి. తెలుగు రాష్ట్రాలు వేరైనా తెలుగు జాతి ఒక్కటే అన్న నినాదం ఎటుపోయింది? ఇంకా ఏం బావుకుందామని.. ఏం చేద్దామని ఈ చిల్లర ప్రయత్నాలు చేస్తున్నారు? నిన్న కాక మొన్న 'జై ఆంధ్రా' నినాదం ఎత్తుకున్న జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు తెలంగాణతో ఏం పని? మళ్లీ తెలంగాణ మీద విషం చిమ్మాలనే కుట్రా? తెలంగాణ నవ నిర్మాణం పేరుతో ఏదో చేద్దామని ప్రయత్నమా? తెలంగాణ మీద యిసుమంత ప్రేమ లేదు.. కానీ తెలంగాణ వనరులు కావాలి.. తెలంగాణను ఇంకా దోచుకోవాలి. అదేమంటే మేమే అభివృద్ధి చేశాం.. మేం లేకుంటే మీకు డెవలప్‌మెంట్ ఎక్కడిది? అనే పాత.. పాచిపోయిన డైలాగులే మళ్లీ వల్లె వేస్తారు.

ఇప్పుడు రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఏదో చేద్దామని పవన్ కళ్యాణ్ చిల్లర ప్రయత్నం. అందుకే జై ఆంధ్రా ఉద్యమాన్ని మళ్లీ తలకెత్తుకున్నాడు. అక్కడ పవన్‌తో పొత్తులో ఉన్న కమలం పార్టీ నేతలు దీని గురించి పెద్దగా మాట్లాడరు. ఎందుకంటే పవన్ నుంచి ఎంతో కొంత లబ్ది పొందుదామనే ఆలోచన వారిది. ఇక తెలంగాణ కాంగ్రెస్ పార్టీ..ఈ విషయాన్ని ముందుగానే గ్రహించి పవన్ సభను అడ్డుకునే ప్రయత్నం చేసింది. ఇక్కడ మనం ఒక విషయం గమనించాలి. న నిరుద్యోగులకు.. ఆంధ్రావాళ్లతో సమస్య అవుతుందంటే పట్టించుకున్న నాథుడే లేదు. మన జర్నలిస్టులకు సమస్య అవుతుందంటే పట్టించుకున్నోడు దిక్కు లేదు. మన ఉద్యోగులు.. తెలంగాణ బిడ్డలు.. ఏపీలో పని చేస్తూ ఇబ్బందులు పడుతున్నారు. అవేమీ మన రాజకీయ నాయకులకు ముఖ్యంగా అధికారంలో ఉన్న వాళ్లకు అస్సలు పట్టవు. కానీ ఇప్పుడు పవన్ కళ్యాణ్ వచ్చి హైదరాబాద్‌లో నవ తెలంగాణ నిర్మాణం పేరిట సభ పెడతామంటే మాత్రం ఉవ్వెత్తున లేస్తున్నారు. అంటే మన దాకా వస్తే కానీ.. అసలు విషయం అర్థం కాదా? ఇక తెలంగాణ టీడీపీ నుంచి ఓ నిఖార్సైన మనిషి.. ఆంధ్ర గడ్డ మీద కాలు పెట్టగానే.. అదేదో ఆవహించిందన్నట్టు.. అసలు చరిత్రలో తెలంగాణ ఉనికే లేదనే మాట్లాడాడు. మరి అకల్ ఉండి మాట్లాడాడా? అకల్ లేక మాట్లాడాడా? లేదా పొత్తులో ఉన్న పవన్ 'జై ఆంధ్రా' ఉద్యమానికి మద్దతుగా మాట్లాడాడా? అన్నది మనం అర్థం చేసుకోవాలి.

రాజకీయ నాయకులు.. ఫక్తు రాజకీయమే చేస్తారు.. తప్పులేదు. కానీ ఇక్కడ నిరుద్యోగులకైనా.. ఉద్యోగులకైనా.. జర్నలిస్టులకైనా.. రాజకీయ నాయకులకైనా.. అంశం ఒక్కటే..!! అదే తెలంగాణ.. ఆంధ్రప్రదేశ్. ఎవరి రాష్ట్రం వారిది.. ఎవరి సర్కారు వారిది.. ఎవరి బతుకు వారిది. కానీ ఇక్కడే తెలంగాణ వారికి అన్యాయం జరుగుతోంది. ఆంధ్రా వలస పాలకులు వెళ్లారు.. కాదు.. కాదు.. వెళ్లినట్లు నటించారు. వలస వచ్చిన వాళ్లు ఇక్కడే వెళ్లూనుకుని పోయారు.. వలస పాలకులు షటిల్స్ కొడుతూ అటూ ఇటూ తిరుగుతున్నారు. అడపదడపా రాజకీయ వ్యభిచారులంతా ఒక్కటై.. దిక్కుమాలిన రాజకీయంతో తమ ఉనికిని చాటుకుంటున్నారు. ఇక్కడ వలస కోసం వచ్చి.. తిష్ట వేసిన వారి గురించి ఓ మాట చెప్పాలి. అసలు తెలంగాణ వాళ్ల ప్రయోజనం కోసమే వచ్చిందా అన్నట్లుగా పరిస్థితి ఉంది. ఇక్కడ ఒక ఓటర్ కార్డ్.. అక్కడ ఒక ఓటర్ కార్డ్.. ఇక్కడ ఒక రేషన్ కార్డు.. అక్కడ ఒక రేషన్ కార్డు.. జర్నలిస్టులకు తెలంగాణలో ఒక అక్రెడిటేషన్ కార్డ్.. ఆంధ్రప్రదేశ్‌లో ఒక అక్రెడిటేషన్ కార్డ్.. ఇలా డబుల్ కార్డులతో మూడు, పువ్వులు ఆరు కాయలుగా హాయిగా కాలం గడిచిపోతోంది. తెలంగాణ ప్రభుత్వం ఇచ్చే పథకాలు.. ఇక్కడే పుట్టి.. ఇక్కడే పెరిగి.. తరతరాలుగా .. నాటి దొరలు, నిజాం రజాకార్ల బూట్ల కింద అణగారిపోయిన అసలు సిసలైన తెలంగాణ బిడ్డలకు మాత్రం న్యాయం జరగడం లేదు. అర్హత ఉన్నా.. సర్కారు నుంచి అందే పథకాల్లో శూన్యహస్తమే మిగులుతోంది. వలస వచ్చిన వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇచ్చే ఆదర్శవంతమైన సర్కారు చెవికి వారి ఆక్రందన వినిపించదు.. వారి కళ్లకు దుర్భర జీవితం కనిపించదు. అందుకే ఎవని పాలైందిరా తెలంగాణ అని మళ్లీ మనం నినదించక తప్పదు.

చివరగా.. ఎవరో ఆంధ్రా నాయకుడు వచ్చి.. నవ తెలంగాణ నిర్మాణం గురించి మాట్లాడుతున్నాడు. కానీ సోయి ఉంటే.. ఇప్పటికైనా కళ్లు తెరుచుకుంటే.. నవ తెలంగాణ నిర్మాణానికి మనమే నడుం బిగించాలి. ఒక్కొక్కరూ ఒక్కొక్క ఉద్యమ కెరటమై.. మళ్లీ పిడికిలెత్తాలి. జై ఆంధ్రా.. అని నినదించిన వారిని.. తెలంగాణ పొలిమేర వరకు తరిమి తరిమి కొట్టాలి. మరో మరాఠా ఉద్యమం తరహాలో... ఆంధ్రా గో బ్యాక్.. ఆంధ్ర గో బ్యాక్ ఉద్యమం తలకెత్తుకోవాలి. జై తెలంగాణ..!!



పెద్ది పద్మ
సీనియర్ జర్నలిస్ట్, 99592 94409

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.